PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 313 | విజయవాడ, ఆదివారం 15 జూన్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 15 June 2025 | Rs



40 Years of Excellence

Infinity Learn BY SRI CHAITANYA

# NEET ను గెలవడం అనివార్యంగా మార్చే శ్రీచైతన్య శిక్షణ

ఫిజిక్స్, కెమిస్ట్రీని మేధస్సుతో ఎదుర్కొనేలా చేసే శిక్షణతో NEET 2025 లో
క్లాస్ రూమ్ కోచింగ్ ద్వారా మరో అద్భుత విజయాన్ని లిఖించిన శ్రీచైతన్య

## ఆలిండియా టాప్ 11 లోపు 6 ర్యాంకులు

ALL-INDIA 1 RANK
రాజస్థాన్ విద్యార్థి
CLASSROOM PROGRAMME
KAVISH
APPL.NO. 250411147966 (GEN-EWS)

చండీఘడ్ విద్యార్థి
ALL-INDIA 5 RANK
CLASSROOM PROGRAMME
DIVYA
APPL. NO. 250410401431 (ST)

పంజాబ్ విద్యార్థి
ALL-INDIA 6 RANK
CLASSROOM PROGRAMME
MD SAMEER
APPL. NO. 250410822821 (OBC)

విజయవాడ విద్యార్థి
ALL-INDIA 8 RANK
CLASSROOM PROGRAMME
B DHEERAJ KUMAR
APPL. NO. 250410546302 (ST)

హైదరాబాద్ విద్యార్థి
ALL-INDIA 10 RANK
CLASSROOM PROGRAMME
MANGARI VARUN
APPL. NO. 250410102078 (OBC)

హైదరాబాద్ విద్యార్థి
ALL-INDIA 11 RANK
CLASSROOM PROGRAMME
YANDRAPATI SHANMUKH
APPL. NO. 250410025239 (OBC)



తెలుగు రాష్ట్రాల నుండి
ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 100లోపు
అత్యధిక ర్యాంకులు సాధించినది శ్రీచైతన్య విద్యార్థులు అయినందుకు గర్వపడుతున్నాం

## ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాప్ 100 లోపు 19 ర్యాంకులు

| RANK | NAME | APPL. NO. |
|---|---|---|
| 12 | AASHI SINGH | 250410681718* |
| 15 | M SINGH RAJPUROHITH | 250410788527* |
| 16 | R SINHA CHAUDHURI | 250410018626* |
| 20 | RUPAYAN PAL | 250410013768* |
| 33 | MOHAMMAD SAMEER | 250410822821 |
| 35 | KAVISH | 250411147966 |
| 37 | A SHANMUKHA NISHANTH | 250410046613 |
| 38 | TEJAS GHOTGALKAR | 250410005029 |
| 46 | MANGARI VARUN | 250410102078 |
| 48 | Y SHANMUKH | 250410025239 |
| 50 | ABHINEET NAGARAJ | 250410397164 |
| 60 | SNEHASIS DAS | 250410826940* |
| 63 | H VIJAYA RAJA K S | 250410262075 |
| 64 | PODILAPU AVINASH | 250410036374 |
| 78 | RAKESH A J | 250410146769* |
| 87 | RAGHAV | 250411402080 |
| 92 | T SIVA MANIDEEP | 250410682794 |
| 94 | SHAH TEJAS | 250410552620* |
| 100 | MUSKAN | 250410005688* |



ఆలిండియా ఓపెన్ కేటగిరి 100లోపు 19 ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ కేటగిరి 1000లోపు 98 ర్యాంకులు

ఆలిండియా ఆల్ కేటగిరి 100లోపు 57 ర్యాంకులు

Sri Chaitanya Educational Committee INDIA

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Scan QR Code for Registration

Ph: 040 66 06 06 06 | www.srichaitanya.net

## కూర్మ గ్రామం అగ్ని ప్రమాదంపై విచారణ

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, శ్రీకాకుళం సిటీ**

శ్రీకాకుళం జిల్లా హిరమండలం కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతైన విచారణ చేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

**కూర్మ ఆలయం అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు : ఎస్‌పి మహేశ్వర రెడ్డి**

శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం కూర్మ రాధాకృష్ణ ఆలయంలో మంగళవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాద ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నిప్రమాద ఘటనలో వ్యక్తిగతంగా, అల్లరి మూకలు ప్రమేయం లేదని అన్నారు. దీపాలతో పూజ చేసి తలుపులు వేసిన అనంతరం పొరపాటున అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నామని తెలిపారు.

## సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోండి

- తల్లికి వందనం'పై పాఠశాల విద్యాశాఖ ప్రకటన

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తల్లికి వందనం పథకంలో అనర్హత పొందిన లబ్ధిదారులు గ్రామ సచివాలయ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు మరోసారి చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. దరఖాస్తుదారుల ఫిర్యాదులను పరిశీలించి వాస్తవంగా అర్హత కలిగితే వారికి కూడా లబ్ధి చేకూరుస్తామని శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. అర్హులైకు సంబంధించిన నగదును ఇప్పటికే వారి తల్లులకు విడుదల చేశామని వెల్లడించింది. తల్లిదండ్రులు లేని పిల్లల నగదును సంబంధిత జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపింది. క్షేత్రస్థాయి పరిశీలన చేసి వారికి కూడా కలెక్టర్ ద్వారా నగదు అందిస్తామని ప్రకటించింది. ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు కలిగిన తల్లుల జాబితా పున: పరిశీలించాక వారికి కూడా నగదు జమచేస్తామని పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత గల ప్రతి విద్యార్థికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని వెల్లడించింది.

## డిఎస్సి 'పిజిటి'కి 86.77శాతం హాజరు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**


ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జరుగుతున్న డిఎస్సి పిజిటి పరీక్షకు 86.77శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష పిజిటి బోటనీ, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పరీక్షలకు 8858 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 7686 మంది(86.77శాతం) శనివారం హాజరయ్యారని మెగా డిఎస్సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాలో అత్యధికంగా 89.07శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని వెల్లడించారు.

## పేరుకుపోయిన కార్ల నిల్వలు

- డీలర్ల వద్ద రూ.52 వేల కోట్ల ఇన్వెంటరీస్

**న్యూఢిల్లీ :** దేశంలో కార్ల అమ్మకాలు పడిపోయాయి. భారీగా పెంచిన ధరలకు తోడు, డిమాండ్ పడిపోవడంతో ఈ ఏడాది మే ముగింపు నాటికి దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద రూ.51,000-52,000 కోట్ల విలువైన కార్ల నిల్వలు పెరుకుపోయాయి. ఆటోమొబైల్ సంస్థలు రోజుకో కొత్త మోడల్‌తో ఇబ్బడిముబ్బడిగా ఉత్పత్తి చేసి మార్కెట్లోకి విడుదల చేయడం కూడా నిల్వలు పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2024 దీపావళి సమయంలో ఇన్వెంటరీ స్టాక్ 40 నుంచి 45 రోజులు ఉండగా.. గడిచిన మేలో ఇది 34-38 రోజులకు తగ్గినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం భారీగా పెరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది మేలో 3,02,214 కార్లు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో విక్రయించిన వాటితో పోల్చితే 3.14 శాతం తగ్గాయి. గడిచిన ఏడాది ఆటోమొబైల్ కంపెనీలు 10 శాతం మేర ధరలను పెంచాయి. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ ఎక్స్ఛేంజీ రేట్ల కారణంగా చూపించి ధరలు పెంచాల్సి వస్తుందంటున్నారు. ఇన్వెంటరీ స్థాయి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తుందని.. ప్రస్తుతం ఇది 52-53 రోజుల స్థాయిలో ఉందని ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ సమాఖ్య(ఫాడా) పేర్కొంది. దీంతో డీలర్ల నిర్వహణ ఖర్చులు అధికమై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపింది.

## సన్ ఫార్మా కొత్త ఎమ్‌డిగా కీర్తి గనోర్కర్



**న్యూఢిల్లీ :** ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ సన్ ఫార్మా నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా కీర్తి గనోర్కర్ నియమితులయ్యారు. దిలీప్ సంఘ్వీ స్థానంలో సెప్టెంబర్ 1 నుంచి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. సంఘ్వీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారని ఆ కంపెనీ తెలిపింది. ఎంబిఎ, కెమికల్ ఇంజినీర్ అయిన గనోర్కర్ 1996 నుంచి సన్ ఫార్మాలో వివిధ విభాగాల్లో పని చేశారు. నార్త్ అమెరికా విభాగం ప్రెసిడెంట్, సిఇఒ అభయ్ గాంధీ తప్పుకోనుండటంతో ఆయన స్థానంలో రిచర్డ్ ఆస్క్రాఫ్ట్ బాధ్యతలను స్వీకరించనున్నారు.

# 'తల్లికి వందనం'కోసం నేటి నుండి రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) పిలుపు
- సిఎంకు లేఖ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎన్‌ఎంఆర్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేటి (శనివారం) నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేట్టాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం విడుదల చేసిన ప్రకటనలో 15వ తేదీన జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని కోరింది. 16న కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించాలని,

17వ తేదీన ప్రజాప్రతినిధుల వద్దకు రాయబారాలు నిర్వహించాలని, 18వ తేదీన పట్టణాల్లో ధర్నాలు, ప్రదర్శనలతో పాటు 23వ తేదీన కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. మరోవైపు తల్లికి వందనంతో పాటు అన్ని సంక్షేమ పథకాలను మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎన్‌ఎంఆర్ కార్మికులకు అమలు చేయాలని కోరుతూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, కె.ఉమామహేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు లేఖ రాశారు. మున్సిపల్ కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిఒ ఎంఎస్ నెంబరు 36 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో నివసిస్తున్న కోటిన్నర మంది ప్రజల అవసరాలు తీరుస్తూ ప్రజారోగ్యం, పర్యావరణాన్ని కాపాడటంలో సుమారు 48 వేలమంది మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎన్‌ఎంఆర్ కార్మికులు విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు.

కరోనా, వరదలు, తుఫాను వంటి సమయాల్లో ప్రాణాలు పణంగా పెట్టి సేవలు చేస్తున్నారని తెలిపారు. అయినా వారికి చాలీచాలని జీతాలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తే కొంత ఉపశమనం ఉంటుందని వివరించారు. పారిశుధ్య కార్మికులకు చెల్లించిన విధంగా ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21 వేలు, రూ.24,500 చొప్పున చెల్లించాలని కోరారు. వారికి ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మానవ పురోగతికి గ్రంథాలయాలు దోహదం



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కెఎస్.చలం

- ప్రజల భాగస్వామ్యంతో వాటిని రక్షించుకోవాలి
- 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ, దిశ
- ప్రజల కర్తవ్యం' చర్చాగోష్టిలో వక్తలు

**ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)**

మానవ పురోగతికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. గ్రంథాలయ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వాటిని కాపాడుకోవాల్సి ఉందని తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ, దిశ - ప్రజల కర్తవ్యం' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో మేధా మథనం పేరిట చర్చాగోష్టి శనివారం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ద్రవిడ విశ్వ విద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్.చలం మాట్లాడుతూ గ్రంథాలయాలతో జ్ఞానం, విజ్ఞానం చేకూరుతాయన్నారు. దేశంలో హిందీ తర్వాత స్థానంలో ఉన్న తెలుగులో పుస్తకాల ప్రచురణ తగ్గిపోతోందని, పబ్లిషింగ్ సంస్థలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలోని గ్రంథాలయాల నిర్వహణా తీరు భేషుగ్గా ఉందని తెలిపారు. మన రాష్ట్రంలోని వెనుకబాటుతనాన్ని తెలియజేశారు. ప్రజల నుంచి గ్రంథాలయ సెస్ వసూలు చేస్తున్నా లైబ్రరీలకు నిధులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ విసి హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రజలను చైతన్యపరచాలన్నారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఫౌండర్ వైస్ ఛాన్సలర్ ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదన్నారు. విక్రం సింహపురి యూనివర్సిటీ మాజీ విసి రొక్కం సుదర్శన్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధిని ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకుని పనిచేయాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి కోసం జరిగే ఉద్యమాల్లో యువతను భాగస్వాములను చేయాలన్నారు. గ్రంథాలయాల ప్రాధాన్యతను వారికి వివరించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు వెనుకబడి ఉండడం వల్ల సమాజానికి కలిగే నష్టాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి, విశాఖ పౌర గ్రంథాలయం జాయింట్ సెక్రటరీ డాక్టర్ డివి.సూర్యారావు, పౌర గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ, సాహితీవేత్తలు నల్లి ధర్మారావు, మేడా మస్తాన్ రెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



కేతిరెడ్డిని గృహనిర్బంధించిన పోలీసులు

## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి గృహ నిర్బంధం

**ప్రజాశక్తి-యల్లనూరు (అనంతపురం)**

అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు మరోసారి గృహ నిర్బంధం చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం తాడిపత్రిలోకి ఆయన్ను రానివ్వకుండా టిడిపి నాయకులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు నుంచి పెద్దారెడ్డి అనుమతి తెచ్చుకున్నారు. అప్పటి నుంచి తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. శాంతిభద్రతల పేరుతో పోలీసులు ఆయన్ను తాడిపత్రి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఇలా జరిగింది. తాజాగా శనివారం ఉదయం తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దారెడ్డి స్వగ్రామం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి వెళ్లారు. శాంతిభద్రతల నేపథ్యంలో తాడిపత్రికి వెళ్లేందుకు వీల్లేదంటూ ఆయనకు నోటీసులు అందజేశారు. అయినా పెద్దారెడ్డి లెక్కచేయకుండా తాడిపత్రికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ఆయన్ను అడ్డుకుని బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లారు. ఈ సమయంలో పెద్దారెడ్డి తీవ్ర స్థాయిలో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రికి వెళ్లేందుకే హైకోర్టు అనుమతి ఇచ్చినా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన తాను తాడిపత్రి వెళ్లి తీరుతానంటూ తెలియజేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తనపై కక్ష సాధింపు చర్యలకు జెసి.ప్రభాకర్‌రెడ్డి పూనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రక్తదానం

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ, సొంత గనుల సాధన కోసం స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఉక్కు నగరంలోని సిడబ్ల్యుసి-1 (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాక్షేత్రం)లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, లైఫ్ లైన్ రక్తనిధి సంస్థల సహకారంతో ఈ రక్తదాన శిబిరం తలపెట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన కెజిహెచ్ మెడిసిన్ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ డి.రాధాకృష్ణన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుని జీవనానికి రక్తం ఎంత ప్రధానమో రాష్ట్ర అభివృద్ధికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అంతే ప్రధానమని తెలిపారు. రక్తదానం చేయడంపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, వాటిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆ పనిని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గడిచిన ఏడు సంవత్సరాలుగా చేస్తూ రక్తదాన శిబిరాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు. అతిథులుగా హాజరైన డాక్టర్ వైఎల్.నరసింహారావు, విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ విభాగాధిపతి డాక్టర్ సారంగి మాట్లాడుతూ రక్తదాన ప్రయోజనాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆవశ్యకత, సొంత గనుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం ఈ రక్త శిబిరం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో



రక్తదాతలతో అతిథులు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

యూనియన్ నాయకులు వైటి.దాస్, యు.రామస్వామి, సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు, రక్తదాన శిబిరం నిర్వాహకులు బి.అప్పారావు పాల్గొన్నారు.

**16 నుంచి ఉక్కు నిరసనలు**

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపేస్తున్నట్టు ప్రధాని మోడీ ప్రకటించాలని, తొలగించిన నాలుగు వేల మంది ఉక్కు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకూ నిరసనలు తెలుపనున్నట్టు విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ప్రకటించింది. జెఎసి ఆధ్వర్యాన శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు ఎం.మన్మథరావు, బి.నాగభూషణం, ఎన్.కనకారావు మాట్లాడారు.




## నీట్‌లో నారాయణ విజయ పరంపర

**ప్రజాశక్తి - హైదరాబాద్**

వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2025 ఆలిండియా కేటగిరీలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మృణాల్ కిషోర్ షా 4వ ర్యాంక్, కేశవ్ మిట్టల్ 7వ ర్యాంక్, సౌమ్య శర్మ 14వ ర్యాంక్, కె జీవన్ సాయి కుమార్ 18వ ర్యాంక్, రూపయన్ పాల్ 20వ ర్యాంక్‌లతో సంచలనం విజయం అందుకున్నారని ఆ సంస్థ వెల్లడించింది. 100లోపు 22 ర్యాంక్‌లు, 1000లోపు 85 ర్యాంక్‌లను విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపింది. ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1000లోపు 216 ర్యాంక్‌లు సాధించి సరికొత్త రికార్డ్‌ను నెలకొల్పామని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ తెలిపారు. తెలుగు రాష్ట్రాలో ఓపెన్ కేటగిరీల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించడం తెలుగు వారికి ఎంతో గర్వకారణమన్నారు. విశిష్టమైన ప్రణాళికతో రూపొందించిన స్టార్ సిఒ బ్యాచ్, ఎన్-40 ప్రోగ్రామ్‌ల ద్వారా మాత్రమే టాప్ ర్యాంక్‌ల సాధన నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. సిబిఎస్‌ఇ సిలబస్ ఆధారంగా చేసుకుని నిర్వహిస్తోన్న నీట్ పరీక్ష కోసం అత్యంత వినూత్న విద్యా ప్రణాళిక వలనే ఉత్తమ ర్యాంక్‌లను సాధించగలుగుతున్నామన్నారు. ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప తెలిపారు.

# మళ్లీ అగ్రి గోల్డ్ బాధితుల సర్వే

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

అగ్రి గోల్డ్ బాధితుల వివరాలను మరోసారి సేకరించనున్నారు. నేర దర్యాప్తు సంస్థ (సిఐడి) నేతృత్వంలో వివరాలు సేకరించి కంప్యూటరీకరణ చేసేందుదు చర్యలు తీసుకుంటున్నారు. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులను వినియోగిస్తున్నారు. గతంలోనే కొంతమంది బాధితులకు పరిహారం అందగా ఇంకా చాలామందికి పరిహారం అందాల్సి ఉంది. ఇలా పరిహారం అందని వారి వివరాలను క్రోడీకరించేందుకు తాజాగా సిఐడి చర్యలు తీసుకుంటోంది. అగ్రి గోల్డ్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా భారీగా డిపాజిట్లు సేకరించి, బాధితులకు తిరిగి ఇవ్వకపోవడంతో పాతికేళ్ల క్రితమే కేసులు నమోదయ్యాయి. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు సంస్థ ఆస్తులను జప్తు చేసేందుకు కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా భాగస్వామ్యం కావడంతో ఇటీవల కాలంలో కేసు పురోగతి సాధించింది. కోర్టు కూడా ఆస్తుల జప్తు ద్వారా వచ్చిన నిధులను బాధితులకు పంపిణీ చేసేందుకు తాజాగా అనుమిచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 32 లక్షల మందివరకు బాధితులు ఉండగా, సంస్థ చేసిన ఆర్థిక మోసం విలువ కూడా ఆరు వేల కోట్లవరకు ఉండడం గమనార్హం. ఇందులో సుమారుగా నాలుగు వేల కోట్ల విలువైన పరిహారాన్ని బాధితులకు అందించినట్లు తెలిసింది. ఇంకా రెండు వేల కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి ఉందని, వాటిని కూడా త్వరగా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంకా పరిహారం అందని బాధితుల వివరాలు, ఒక్కొక్కరికీ ఎంత చెల్లించాల్సి ఉంటుందన్న వివరాలు సిద్ధం చేసి, వాటిని కంప్యూటర్‌లో పొందుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అనేక మంది మహిళా పోలీసులను సిఐడికి తాత్కాలిక డిప్యుటేషన్‌పై బదిలీ చేసి రికార్డులను కంప్యూటరీకరణ చేయిస్తుండడం విశేషం. పోలీసు శాఖలో కంప్యూటర్లు పరిమితంగా ఉండడంతో విద్యా సంస్థలతో మాట్లాడి, వారి కంప్యూటర్లను వినియోగించుకున్నారు. ఇప్పటికే విజయవాడలోని సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌ను వినియోగించుకున్న సిఐడి అధికారులు తాజాగా మరో విద్యా సంస్థతో అవగాహనకు వచ్చినట్లు సమాచారం.



చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులోని మామిడి జ్యూస్ తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

## మామిడి రైతులను ఆదుకుంటాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:**

రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సబ్సిడీ రూపంలో రూ.168 కోట్లు చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లాలోని గుడిపాల మండలం గొల్లమడుగులోని మామిడికాయలు నిల్వ ఉంచిన పండ్ల యూనిట్‌ను, మామిడి జ్యూస్ తయారీ విధానాన్ని పరిశీలించారు. పల్లూరులో మామిడి రైతులతో ముచ్చటించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రైతులను అన్ని విధాలు ఆదుకోవడానికి టిడిపి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల స్వేచ్ఛగా వారు పండించిన మామిడి పంటను మార్కెట్లో అమ్ముకోవచ్చని, సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, చివరి కాయ వరకు విక్రయించుకోవచ్చని తెలిపారు. రైతులు మార్కెట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద మామిడి కాయలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 22 మెట్రిక్ టన్నుల మామిడి కాయలను కొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, హార్టికల్చర్ సెక్రెటరీ రాజశేఖర్ బాబు, ఆర్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పాల్గొన్నారు.

## పరామర్శకు వెళితే కుట్ర చేయడం భావ్యమా : వైసిపి అధినేత జగన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**



పొగాకు రైతులను పరామర్శించడానికి వెళితే తెలుగుదేశం నాయకులతో రాళ్లు రువ్వించి కుట్ర చేయడం భావ్యమా అనివైసిపి అధినేత జగన్ ప్రశ్నించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన శనివారం పోస్ట్ చేశారు. పంటకు కనీస మద్దతు ధర లభించక రైతులు అన్యాయానికి గురవుతుంటే వారిని పరామర్శించి భరోసా ఇవ్వడానికి పొదిలి వెళితే అక్కడకు 40 వేలమంది రైతులు వచ్చారని, టిడిపి 40 మంది కార్యకర్తలను పెట్టి రాళ్లు రువ్వించారని, 40 వేలమంది తిరగబడితే ఏమయ్యేదని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలపై గొంతెత్తితే దాన్ని డైవర్టు చేయించడానికి ఇలా చేయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. టిడిపి కార్యకర్తలు రాళ్లు రువ్వితే వైసిపి కార్యకర్తలపై కేసులు పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు.

## పొదిలి రాళ్లదాడిలో మరో 15 మంది అరెస్టు

**ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)**

ప్రకాశం జిల్లా పొదిలిలో ఈ నెల 11న వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న రాళ్లదాడి ఘటనకు సంబంధించి శనివారం మరో 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సిసి కెమెరాల్లో రికార్డు అయిన విజువల్స్ ఆధారంగా మహిళలు, పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మరో 15 మందిని అరెస్టు చేశారు. అందులో తొమ్మిది మందిని శనివారం కోర్టుకు హాజరు పరిచారు. మరో ఆరుగురికి స్టేషన్ బెయిలు మంజూరు చేశారు. అరెస్ట్ అయిన వారితో మాట్లాడేందుకు వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకట్ రాంబాబు, కుందూరు నాగార్జున రెడ్డి, ఉడుముల శ్రీనివాస్ రెడ్డి, ఇతర వైసిపి నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. స్టేషన్ బెయిల్ ఇచ్చిన వారితో మాట్లాడేందుకు అనుమతించాలంటూ సిఐ వెంకటేశ్వర్లును చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కోరారు. అందుకు ఆయన అనుమతి ఇవ్వలేదు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పొదిలి కోర్టు వద్ద రాళ్లదాడికి పాల్పడిన వారితో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తదితర వైసిపి నేతలు మాట్లాడారు.

**పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు**

పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వైసిపి నేతలు తెలిపారు. రాళ్ల దాడి ఘటనలో 15 మందిని అరెస్టు చేసి ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చి.. తొమ్మిది మందిని కోర్టులో హాజరుపరచడం ఏమిటని ప్రశ్నించారు.

## లబ్ధిదారుల కుదింపు

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

తల్లికి వందనం పేరుతో తల్లులకు వంచన చేశారని, అడ్డగోలు నిబంధనలతో లబ్దిదారులను కుదించారని వైసిపికి చెందిన మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ స్కూళ్లలో వసతులు, మధ్యాహ్న భోజనం అన్నీ నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. టీచర్ల బదిలీల పేరుతో అడ్డగోలుగా అవినీతి పర్వం నడుస్తోందన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెడుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని, వారి హక్కులు, చట్టాలను ఆపహస్యం చేస్తున్నారని వివరించారు. జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు సేకరించడానికి యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్‌ను ప్రామాణికంగా తీసుకుంటారని, దీని ప్రకారం రాష్ట్రంలో 87.41 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, వారికి రూ.13,110 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం రూ.8745 కోట్లు మాత్రమే చెల్లించిందని వివరించారు. అప్పట్లో రెండువేల రూపాయలు పాఠశాలలకు ఇస్తే జె ట్యాక్స్ అన్నారని, ఇప్పుడేమంటారని ప్రశ్నించారు.

## హెచ్‌సిఎల్ టెక్, వొల్వో కార్స్ జట్టు

**నోయిడా :** హెచ్‌సిఎల్ టెక్‌తో వొల్వో కార్స్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఇంజనీరింగ్ సేవల కోసం వ్యూహాత్మక సరఫరాదారుల్లో ఒకటిగా గ్లోబల్ టెక్ కంపెనీ హెచ్‌సిఎల్ టెక్‌ను వొల్వో ఎంచుకున్నట్లు పేర్కొంది. డిజిటల్ సేవలలో ఎండ్-టు-ఎండ్ ఇంజనీరింగ్ పరిష్కారాలను అందించనుందని తెలిపింది.

## కుబేరుల్లో రెండో స్థానంలోకి లారీ ఎల్లిసన్

**వాషింగ్టన్ :** టెక్, ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రపంచ కుబేరుల జాబితాలో రెండో స్థానాన్ని కోల్పోయారు. ఆ స్థానాన్ని ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సొంతం చేసుకున్నారు. 243 బిలియన్ డాలర్ల సంపదతో ఎల్లిసన్ రెండో అతిపెద్ద ధనవంతుడిగా చోటు సంపాదించుకున్నారని ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్స్ జాబితా వెల్లడించింది. మేతో ముగిసిన త్రైమాసికంలో ఆ కంపెనీ షేరు భారీగా పెరగడంతో ఆయన సంపద పెరిగింది. ఈ జాబితాలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 407 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. బెజోస్ సంపద 228 బిలియన్ డాలర్లు, మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ సంపద 239 బిలియన్ డాలర్లుగా ఉంది. వీరిని అధిగమించి ఎల్లిసన్ రెండో స్థానం సొంతం చేసుకున్నారు.

## నీట్‌లో 'శ్రీ గోసలైట్స్' విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి - హైదరాబాద్**

Sri Gosalites Medical Academy ...brand of future medicos

ఎన్‌టిఎ ప్రకటించిన నీట్-2025 ఫలితాల్లో శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలతో మరో ఏడాది చరిత్ర సృష్టించారని ఆ సంస్థ తెలిపింది. ఈ ఏడాది నీట్ పరీక్ష కఠినంగా ఉన్నప్పటికీ, పరీక్షా విధానం మారినప్పటికీ, నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రోగ్రామ్స్ డిజైన్ చేసి, నిజాయితీగా ప్రయత్నం చేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని శ్రీ గోసలైట్స్ నిరూపించిందని పేర్కొంది. తమ విద్యార్థులు సాధించిన ఈ విజయానికి వారిని అభినందిస్తున్నామని తెలిపింది. "720 మార్కులకు 600 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 11 మంది, 550 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 69 మంది, 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 379 మంది, 470 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 814 మంది, 450 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 1,086 మంది విద్యార్థులతో అత్యుత్తమ మార్కులు సాధించడం గర్వకారణం." అని శ్రీ గోసలైట్స్ తెలిపింది. నీట్-25 ఫలితాలను అంచనా వేయగా సుమారుగా 1,500 మందికి పైగా శ్రీ గోసలైట్స్ విద్యార్థులు దేశ వ్యాప్తంగా 'ఫ్రీ మెడికల్ సీట్లు' సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నట్లు శ్రీ గోసలైట్స్ ఛైర్మన్ నరేంద్ర బాబు పేర్కొన్నారు. నీట్ పరీక్ష ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు, తెలుగు రాష్ట్రాల్లో లాంగ్ టర్మ్ కోచింగ్ ద్వారా 700 పైబడి మార్కులు సాధించిన మొట్టమొదటి విద్యాసంస్థగా శ్రీ గోసలైట్స్ చరిత్ర సృష్టించిందన్నారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 313 | విజయవాడ, ఆదివారం 15 జూన్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 15 June 2025 | Rs

Agri Gold

మళ్లీ అగ్రి గోల్డ్ బాధితుల సర్వే

2




## చోకర్స్ కాదు 'ఛాంపియన్స్'

- 27ఏళ్ల నిరీక్షణకు తెర
- టెస్ట్ ఛాంపియన్స్ షిప్ గద దక్షిణాఫ్రికా కైవసం

6

# ఇజ్రాయిల్, ఇరాన్ భీకర దాడులు

**ఇరాన్‌లో 20మంది చిన్నారులతో సహా 78 మంది, ఇజ్రాయిల్‌లో నలుగురు మృతి**

**ఆత్మాహుతి డ్రోన్లతో150 లక్ష్యాలపై దాడులు చేశామన్న ఇరాన్**

ప్రత్యర్థికి సహకరిస్తే అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ స్థావరాలపైనా దాడులు చేస్తామని హెచ్చరిక

దాడులు కొనసాగితే టెహరాన్‌ను తగలబెడతామన్న ఇజ్రాయిల్

**టెహరాన్, టెల్ అవీవ్ :** ఇజ్రాయిల్, ఇరాన్ పరస్పరం బీకర దాడులకు పాల్పడుతున్నాయి. ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండా బీకర దాడులను మొదలుపెట్టిన ఇజ్రాయిల్ మధ్యప్రాచ్యంలో యుద్ధానికి తెరతీసింది. ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇజ్రాయిల్ దాడులను కొనసాగిస్తోంది. ఇరాన్ 'ఆపరేషన్ టూ ప్రామిస్ 3 కోడ్' పేరిట ప్రతి దాడులతో విరుచుకుపడుతోంది. శనివారం ఇరు దేశాలు పరస్పరం దాడులు కొనసాగించాయి. ఇరాన్ డ్రోన్లను, బాలిస్టిక్ క్షిపణులను వందలాదిగా ఇజ్రాయిల్ పైకి పంపింది. దీంతో జెరూసలేం, టెల్ అవీవ్‌లు వరుస దాడులతో కంపించాయి. ఆక్రమిత భూభాగాల్లో చొచ్చుకు పోయిన ఆర్ష్ తరగతి ఆత్మాహుతి డ్రోన్లు నిర్దేశిత లక్ష్యాలను విజయవంతంగా ఛేదించాయని ఇరాన్ ఆర్మీ ప్రకటించింది. తిబెరియాస్, ఆక్రమిత గోలన్, దిగువ గలీలి ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. మొత్తంగా వ్యూహాత్మక మిలటరీ బేస్‌లు సహా 150 లక్ష్యాలపై దాడులు జరిగాయని బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వాహిది తెలిపారు. ఇజ్రాయిల్ ప్రభుత్వ కమాండ్, కంట్రోల్ సెంటర్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సెంటర్‌లు వున్న నెవటిమ్, ఒవడా ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నామని పేర్కొన్నారు.

**మరో ఇద్దరు సైనిక జనరల్స్ మృతి**

ఇరాన్‌పై శనివారం జరిగిన దాడుల్లో ఇరాన్ సైనిక జనరల్స్ ఇద్దరు మరణించారు. బ్రిగేడియర్ జనరల్ ఘోల్‌మెర్జా మెహ్రాబి, బ్రిగేడియర్ జనరల్ మెహిది రబ్బాని మరణించినట్లు ఇరాన్ సాయుధ బలగాల కమ్యూనికేషన్ సెంటర్ ప్రకటించింది.

**ఇరాన్‌లో 78మంది, ఇజ్రాయిల్‌లో నలుగురు మృతి**

ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 78మంది మరణించారని, వీరిలో 20మంది మిగతా 5లో



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఇజ్రాయిల్ దాడితో ధ్వంసమైన భవనం వద్ద పరిస్థితి



ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్‌లో ఇరాన్ దాడి దృశ్యం



## మూడు నెలల్లో నివేదిక

- విమాన ప్రమాదంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై హోం శాఖ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ దర్యాప్తు చేసి, మూడు నెలల్లోగా నివేదిక అందజేస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేశామని, ఆ కమిటీతో సోమవారం భేటీ అవుతామని చెప్పారు. అవసరమైతే ఈ కమిటీలో మరికొంతమందిని చేరుస్తామని ప్రకటించారు. డిఎన్ఎ పరీక్షలు వేగంగా జరుగుతున్నాయని, పార్థివ దేహాలను వీలైనంత తొందరగా అందజేస్తామని తెలిపారు. ఎయిర్‌సేఫ్టీపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హోం శాఖ సెక్రటరీ అధ్యక్షతన ఏర్పాటైన హైలెవల్ కమిటీలో సివిల్ ఏవియేషన్ సెక్రటరీ, వివిధ రంగాల నిపుణులు, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబి ఉంటారని తెలిపారు. మూడు నెలల్లో ప్రమాదంపై కమిటీ నివేదిక అందజేస్తుందని భావిస్తున్నామని అన్నారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఎఐబి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బోయింగ్ 787 సిరీస్ విమానాల భద్రతపై దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. ప్రస్తుతం 34 బోయింగ్-787 విమానాలు మిగతా 5లో



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రేషన్‌కు బదులు

# నగదు..కూపన్లు

- లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోండి
- సమీక్షలో సిఎం ఆదేశం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రేషన్ సరుకులకు బదులుగా నగదు చెల్లించడం, కూపన్లను పంపిణీ చేయడం వంటి ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. ఏడాది పాలనపై ఐవిఆర్ఎస్‌లో వచ్చిన ప్రజాభిప్రాయాలపై శనివారం సాయంత్రం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరఫరా వ్యవస్థలో ఇటీవల తీసుకువచ్చిన మార్పులను ప్రస్తావించారు. వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులను ఇంటికి తీసుకువెళ్లి అందించడం మరింత మెరుగ్గా జరిగేలా చూడాలని అన్నారు. లబ్ధిదారులందరికి రేషన్ సరుకులు అందేలా చూడాలని అన్నారు. దీనికోసం 'చౌకధరల దుకాణాలను పెంచడం, నగదును నేరుగా ఇవ్వడం లేదా కూపన్లను పంపిణీ చేయడం' వంటి ప్రత్యామ్నాయలపై లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. అవినీతిపై మాట్లాడుతూ రాష్ట్రాన్ని అవినీతి రహితంగా మార్చాలని అన్నారు. ఏశాఖలో అవినీతి ఆరోపణ వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిట్ జరపాలని సిఎం అధికారులకు సూచించారు. సమస్యలు ఉన్నచోట సంతృప్తి పెరిగేలా చూడాలని తెలిపారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహించడంతో పాటు ఆగస్టు 15 కల్లా అన్ని సేవలనూ వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు పింఛన్ల పంపిణీ, అన్నా క్యాంటీన్లు, ఇసుక, చౌకదుకాణాలు, ఆస్పత్రి, మున్సిపల్, ఆలయాల, ఎపిఎస్‌ఆర్‌టిసికి సంబంధించిన సేవలపై ప్రజాభిప్రాయాలతో కూడిన వివరాలను సిఎంకు అందించారు. మహిళలపై హింసకు సంబంధించి పబ్లిక్ ప్రాంతాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం తెలిపారని, పోలీసుల స్పందన బావుందని 59.5 శాతం మంది తెలిపారని వివరించారు. గంజాయికి సంబంధించి 27.4 శాతం మంది తమ ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయని చెప్పినట్లు అధికారులు తెలిపారు.

పనిగంటల పెంపును వ్యతిరేకిస్తూ...

## 20న నిరసన ప్రదర్శనలు

కార్మిక ,ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో పనిగంటలు పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 20వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని

ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. విజయవాడ ఎంబి భవన్‌లో శనివారం జరిగిన కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కేంద్రాలతో పాటు, నియోజకవర్గ, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఈ సమావేశం పిలుపునిచ్చింది. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తూ కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పనివిధానాన్ని 10గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు మహిళలు రాత్రి వేళల్లో పని చేయవచ్చని పేర్కొనడమంటే కార్మికులను వెట్టిచాకిరి చేయించుకునే విధానానికి నెట్టివేయడమేనన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జిఓ వల్ల కార్మికులు, ఉద్యోగుల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. లేబర్ కోడ్ లాంటి చట్టాల వల్ల కనీస వేతనాలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు కోల్పోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, శ్రామికమహిళా రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, వైఎస్‌ఆర్‌టియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్‌రవి, సిఐటియు రాష్ట్ర నాయులు కె.ఉమామహేశ్వరరావు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రినాద్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నీట్-యుజి ఫలితాలు విడుదల

**న్యూఢిల్లీ, శ్రీకాకుళం సిటీ,ఏలేశ్వరం :** దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్) అండర్ గ్రాడ్యుయేట్ (యుజి) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా 22,09,318 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,36,531 మంది అర్హత సాధించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తెలిపింది. ఈ ఫలితాల్లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్ కుమార్ ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ రెండో ర్యాంక్, మహారాష్ట్రకు చెందిన కృషంగ్ జోషి మూడో ర్యాంక్ సాధించి తమ సత్తా చాటారు. మహిళల విభాగంలో ఢిల్లీకి చెందిన అవికా అగర్వాల్‌కు తొలి ర్యాంకు దక్కింది. తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్ సాయి కుమార్ 18వ ర్యాంకు సాధించగా, ఆంధ్రాకు చెందిన దర్బా కార్తీక్ రామ్‌కు 19వ ర్యాంకు దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుండి 36,776 మంది విద్యార్థులు, తెలంగాణ రాష్ట్రం నుండి 41,584 మంది విద్యార్థులు అర్హత సాధించారు. తెలంగాణకు చెందిన షణ్ముఖ్ నిషాంత్‌కు 37, మంగారి వరుణ్‌కు 46, యంద్రపాటి షణ్ముక్‌కు 48వ ర్యాంకు వచ్చింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్‌కు 56వ ర్యాంకు, దేసిన సూర్యచరణ్‌కు 59, పొదిలపు అవినాశ్‌కు 64వ ర్యాంకు, యద్రా సమీర్‌కుమార్‌కు 70వ ర్యాంకు వచ్చింది. తుమ్మూరి శివ మణిదీప్‌కు 92వ ర్యాంకు దక్కింది. తెలంగాణకు చెందిన బిదీష

రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

తెలంగాణ, ఆంధ్రా విద్యార్థులకు 18,19 ర్యాంకులు



అవికా అగర్వాల్ | మహేశ్ కుమార్ | ఉత్కర్ష్

మాఝి 95వ ర్యాంక్ సాధించింది. విద్యార్థులు వ్యక్తిగత లాగిన్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే వారి ఈ-మెయిల్‌కు స్కోర్ కార్డులు పంపుతున్నారు.

**డాక్టర్‌గా సేవలందించాలనేదే నా కోరిక**
**ఓపెన్ కేటగిరి 64వ ర్యాంకర్ అవినాష్**



'డాక్టర్‌గా సేవలు అందించాలనేది నా కోరిక, కళ. ఎంత కఠినమైనా... అందుకోసం అన్ని ప్రయత్నాలు చేస్తాను' అని నీట్ ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లా అరసవల్లికి చెందిన పొదిలాపు అవినాష్ తెలిపారు. 720 మార్కులకు గాను 652 మార్కులు సాధించి రాష్ట్రంలో టాప్ 5 జాబితాలో చోటు దక్కించు కున్నారు. తండ్రి పొదిలాపు శ్రీనివాస రావు మెడికల్ ఫీల్డ్‌లో వ్యాపారం చేస్తున్నారు. తల్లి భారతి గృహిణి,

**గ్రామీణ మహిళలకు వైద్యసేవలందిస్తాను**
**ఇడబ్ల్యుఎస్‌లో 33వ ర్యాంకర్ వైష్ణవి**



గైనకాలజిస్టుకు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు వైద్య సేవలు అందించాలన్నదే తన ధ్యేయమని ఆలిండియా ఇడబ్ల్యుఎస్ కోటాలో 33వ ర్యాంకు సాధించిన కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లికి చెందిన గొల్లపల్లి వైష్ణవి అన్నారు. తన విజయానికి తల్లిదండ్రులే కారణమని తెలిపారు. రైతు కుటుంబానికి చెందిన వైష్ణవి పదవ తరగతి వరకు రాజమండ్రిలో, ఇంటర్మీడియట్ విద్య విజయవాడలో చదివారు. పదవ తరగతిలో 583 మార్కులు, ఇంటర్లో 984 మార్కులు సాధించారు.

## ఎస్‌బిఐ రుణాలు చౌక

- వడ్డీ రేట్లు అర శాతం తగ్గింపు

**ముంబయి :** రిజర్వు బ్యాంక్ రెపో రేటును 0.50 శాతం తగ్గించిన నేపథ్యంలోస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే తాజాగా రుణాలపై రేట్లను అర శాతం మేర కోత పెట్టింది. సవరించిన వడ్డీ రేట్లు జూన్ 15 నుంచి అమల్లోకి రానున్నాయని ఎస్‌బిఐ వెల్లడించింది. రుణాలపై ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ (ఇబిఎల్‌ఆర్) 8.65 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గించింది. దీంతో గృహ రుణాలు, ఎంఎస్ఎంఇ రుణాలకు ఇబిఎల్‌ఆర్ వర్తిస్తుంది. గృహ రుణాలకు రెపోరేటును అనుసంధానం చేసేందుకు ఇబిఎల్‌ఆర్ విధానాన్ని 2019 అక్టోబర్ 1 నుంచి ఎస్‌బిఐ అనుసరిస్తోంది. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారితో పాటు, కొత్తగా రుణాలు తీసుకునే వారికీ ప్రయోజనం చేకూరనుందని పేర్కొంది.

**ఎఫ్‌డి రేట్లలోనూ కోత**

స్పెషల్ ఎఫ్‌డి స్కీమ్ అమృత్ వృష్టి పథకాల వడ్డీపై 25 బేసిస్ పాయింట్లను కోత పెట్టింది. 444 రోజుల కాలవ్యవధి కలిగిన ఈ పథకంలో సాధారణ పౌరులకు 6.60 శాతం వడ్డీ లభిస్తుంది. సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.20 శాతం వడ్డీ లభించనుందని ఎస్‌బిఐ వెల్లడించింది.

విద్యుత్ ప్రయివేటీకరణకు

# స్మార్ట్ మీటర్ల ముసుగు

- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి రాజేంద్రన్
- గుంటూరులో ప్రారంభమైన 11వ రాష్ట్ర మహాసభ




మహాసభలో మాట్లాడుతున్న రాజేంద్రన్

**ప్రజాశక్తి-గుంటూరు**

విద్యుత్ రంగం ప్రయివేటీకరణకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ఒక ముసుగని అని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్.రాజేంద్రన్ అన్నారు. రెండ్రోజులపాటు జరిగే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 11వ మహాసభ గుంటూరులోని జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమైంది. తొలుత యూనియన్ జెండాను సిపిడిసిఎల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రన్ మాట్లాడుతూ.. సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో ఇప్పటికే 56 శాతం విద్యుత్ రంగం, 19 శాతం విద్యుత్ పంపిణీ వ్యవస్థ, 55 శాతం పునరుత్పాదక విద్యుత్ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని వివరించారు. దీన్ని పూర్తిగా ప్రయివేటుకు అప్పగించడానికి విద్యుత్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రయివేటు సంస్థల వద్ద విద్యుత్ కొనుగోలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తోన్న ఫలితంగా, అధిక ధరకు కొనుగోలు చేసిన రాష్ట్రాలు అప్పులపాలవుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే అదానితో చేసుకున్న ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటి నిర్వహణను, సాఫ్ట్‌వేర్‌ను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించిందని తెలిపారు. విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఉధృతమైన పోరాటాలు జరుగుతున్నాయని, ఆయా పోరాటాలలో ఫెడరేషన్ ముఖ్య భూమిక పోషిస్తోందని తెలిపారు. ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టడానికి వినియోగదారులు, కార్మికులతో కలిసి మిగతా 5లో

## యోగా డేతో డిఎస్సీ షెడ్యూల్ మార్పు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యోగా దినోత్సవం కారణంగా ఈ నెల 20,21 తేదీల్లో జరగాల్సిన డిఎస్‌సి పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు డిఎస్సీ కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను జులై 1,2 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలను, మార్చిన హాల్ టిక్కెట్లను ఈ నెల 25వ తేదీన ఎపి మెగా డిఎస్సి-2025 వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి మార్చిన హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని వాటి ప్రకారం పరీక్షలకు హాజరు కావాలని కోరారు. యోగా డే రోజు అభ్యర్థుల రాకపోకలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశ్యంతో ఈ మార్పు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

5



యోగాసనాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

యోగాసనాలు కాదు..

# రోడ్లు వేయండి

ఆసనాలతో గిరిజనుల నిరసన

**ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి జిల్లా)**

'యోగాసనాలు కాదు.. రోడ్లు వేయండి మహాప్రభో' అంటూ అల్లూరి జిల్లా అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ కొండశిఖర గ్రామమైన పాలబందకు చెందిన గిరిజనులు యోగాసనాలు వేస్తూ శనివారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. యోగా పేరిట ప్రభుత్వం నానా హడావుడి చేస్తూ గిరి గ్రామాల్లో సౌకర్యాలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అటవీ అధికారుల అభ్యంతరాలతో నిలిచిపోయిన రోడ్డు పనులకు తక్షణం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న మద్దతు తెలిపి మాట్లాడారు. డోలీ మోతల మిగతా 5లో

సంపాదకీయం


# ఎవరి కోసం?

**మా**నవ ఆరోగ్యాన్ని పెంపొందించే ప్రాచీన భారతీయ సాధన... యోగ. శరీరంపై పట్టు సాధించడం కోసం యోగ అనే ప్రక్రియను ప్రాచీన కాలంలో తాంత్రికులు ప్రారంభించారు. ఈ యోగాసనాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే గాక, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, జీవనశైలి సంబంధిత వ్యాధులను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రాచీన గ్రంథాలు, పతంజలి 'యోగ సూత్రాలు' మొదలైన పుస్తకాలు కూడా శరీరాన్ని ఆరోగ్యంగా వుంచే ప్రక్రియగా దీన్ని వివరిస్తాయి. 'దాచిపెట్టిన జ్ఞానం నిరుపయోగం కావడమేగాక ప్రజలను పీడించడానికి సాధనమౌతుంది' అంటారు కొడవటిగంటి. ఆ కాలంలో అనేక వ్యాధులను నయం చేయడానికి యోగ ఉపయోగపడుతుందనే దురభిప్రాయం వుండేది. అది కాస్తా... ఇప్పుడు, జబ్బులు నయం చేయడానికి యోగాను మించింది లేదన్న ప్రచారంగా మారింది. కొన్ని రకాల జబ్బులకు వాకింగ్ వంటి వ్యాయామాన్ని డాక్టర్లు సూచిస్తున్నట్లుగానే, యోగాని కూడా చూడాలి. శరీరంలోని కండరాల నొప్పులను నయం చేయగలదేమో కాని, యోగ వల్ల గుండె జబ్బుల వంటి వ్యాధులు కూడా నయమౌతాయన్న ప్రచారం నిజం కాదు. దానికి సంబంధిత వైద్యులను సంప్రదించాల్సిందే. శాస్త్రీయంగా రుజువుకాని, ఎట్టి పరిశోధనలూ జరగని, పాతకాలపు నాటు వైద్యాలు, నమ్మకాలు... ప్రకృతి వైద్యం, ప్రాణిక్ హీలింగ్, యోగా, ధ్యానం వంటి పేర్లతో ఇటీవల అనేకం ప్రచారంలోకి వస్తున్నాయి.

క్రీ.పూ. మొదటి శతాబ్దం- నాల్గవ శతాబ్దం మధ్య సంకలనం చేయబడిన 'పతంజలి యోగ సూత్రాలు'... యోగ తత్వ శాస్త్రానికి సంబంధించిన మొదటి గ్రంథంగా చెబుతారు. నాటి పతంజలి సూత్రాలను ఇప్పుడు పట్టుకొచ్చి నేటి పతంజలి పెద్ద వ్యాపారం నడుపుతున్నాడు. రామ్‌దేవ్ బాబా 'యోగా' సామ్రాజ్యం విలువ దాదాపు రూ.4వేల కోట్ల పైమాటే. ఈ యోగా వ్యాపారానికి మీడియా పెద్దఎత్తున ప్రచారం ఇస్తోంది. ఇది విచ్చలవిడిగా వెలుస్తున్న యోగా కేంద్రాల వ్యాపారానికి దోహదపడుతోంది. ప్రాచీన కాలం నుంచి మన దేశానికున్న ప్రత్యేకతల్లోకి నేడు మతాన్ని చొప్పించే ప్రయత్నం ప్రతి సందర్భంలోనూ జరుగుతుండటం బహిరంగ రహస్యం. ఇంకోవైపు దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించడానికీ, పైసా ఖర్చు లేకుండా పెద్దఎత్తున రాజకీయ ప్రచారానికీ యోగాకు భారీ ప్రచారం కల్పిస్తున్నారు. ప్రతి యేడాది మల్లే ఈ ఏడాది కూడా జూన్ 21న జరుగుతున్న యోగా దినోత్సవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీదైన ఈవెంట్ మాదిరిగా పెద్దఎత్తున చేస్తున్న ప్రచారమే దీనికి నిదర్శనం. ఇప్పటికే 2కోట్ల మందికిపైగా ఎన్‌రోల్ చేసుకున్నట్లు చెప్తున్నారు. విశాఖ ఆర్‌కే బీచ్‌లో ప్రధాని మోడీ సమక్షంలో జరిగే ఈ యోగా కార్యక్రమంలో 5లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొంటారని, దీనికోసం రూ.50కోట్లు మంజూరు చేశామని రాష్ట్రప్రభుత్వం చెబుతోంది. యోగాంధ్ర పేరుతో నెల రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఒక్కరోజు కోసం కోట్ల రూపాయల ఖర్చుతో చేసే ఈ ప్రచారానికి విద్యార్థుల భవిష్యత్‌ను సైతం ఫణంగా పెట్టేందుకు సిద్ధమయ్యారు. 20, 21 తేదీల్లో జరగనున్న డిఎస్సీ పరీక్షలను వాయిదా వేశారు. ఇదంతా ఎవరి ప్రయోజనం కోసం? మరీ ముఖ్యంగా యోగాకి హిందూమతానికి లింక్ పెట్టి, హిందూత్వ సిద్ధాంతాన్ని జనానికి ఎక్కించే ప్రయత్నం ప్రభుత్వ కార్యక్రమంగా చేయడం శోచనీయం. అందుకు మన రాష్ట్రం వేదికగా మారడం విచారకరం. కార్పొరేట్ సంస్థలు దీన్ని వ్యాపార అవకాశంగా మార్చుకుని, యోగా పాఠశాలలు, బ్రాండెడ్ యోగా కేర్, ప్రత్యేక శిబిరాల పేరుతో వ్యాపారం చేసుకుంటున్నాయి. 'ఇంతవరకూ తత్వవేత్తలు ప్రపంచాన్ని గురించి వివరించారు. కావల్సింది దాన్ని మార్చడం' అంటారు కారల్ మార్క్స్. 'మన చేతుల్లో ఏముంది? అంతా దైవ నిర్ణయం' అంటారు ఆధ్యాత్మికవాదులు. అయితే, అంతా మన చేతుల్లోనే వుందనీ, మనం ఏం చేయాలనుకుంటే అది చేసెయ్యగలమనీ మార్క్స్ చెప్పలేదు. ప్రకృతి, సమాజం... నిరంతరం మారుతుంటాయనీ, ఈ ప్రక్రియలో మనం జోక్యం చేసుకుని ఆ మార్పును అభివృద్ధి వైపు పయనింపజేయాలనీ చెప్పాడు. యోగాని కూడా ఈ విధంగానే చూడాలి. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయష' అన్నట్లుగా... అంతా యోగాలోనే వుందనే రాజకీయ ప్రచారం నుంచి బయటపడాలి. రాజకీయ, వ్యాపార, మత ప్రయోజనాలకు అతీతంగా, మానవ ఆరోగ్యానికి మేలు చేసే సాధనగా యోగాను ప్రోత్సహించాలి. అంతేగాని యోగా పేరుతో హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేసి, విద్వేష రాజకీయాలకు పురిగొలిపే ప్రచార ఆర్భాటాలకు ప్రజలు దూరంగా వుండాలి.

మంచి మాట



**పేదరికంలో మగ్గుతున్న అభాగ్యుడికి తనను ఆకలికి గురిచేసిన దేశాన్ని ఎవరు పాలిస్తే ఏమిటి? తనకు కావలసిందంతా తన దుర్భర పరిస్థితిలో మార్పు వస్తుందా రాదా అనేదే.**

**- డేనియల్ డి లియోన్,**
**అమెరికన్ సోషలిస్టు లేబర్ పార్టీ నాయకుడు.**

---

ప్రస్తుతం

# మోడీ @ 11 - రివర్స్ పొగడ్తలు


**న**రేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి-ఎన్డీఏ ప్రభుత్వం మూడో దఫా పాలన తొలి ఏడాది పూర్తి చేసుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత ఒకే ప్రధాని వరుసగా మూడుసార్లు ఎన్నిక కావడం అసాధారణమని ముందు నుంచి మోత మోగిస్తూనే వున్నారు. ఇందిరాగాంధీ తర్వాత 'ఉక్కు ప్రధాని' మోడీ యేనని చెప్తూనే మరోవైపున ఆమెతో పాటు నెహ్రూను కూడా పక్కన పెట్టి ఈయననే ఊరేగించే భారీ పథకం నడుస్తూనే వుంది. నెహ్రూ హయాంలో తప్పొప్పులు ఏమున్నా నవభారత నిర్మాణానికి, స్వావలంబనకు, అలీన విధానానికి పునాదులు పడ్డాయనేది నిర్వివాదాంశం. ఇందిరా గాంధీ ఏకపక్ష ధోరణి ఎమర్జెన్సీతో పరాకాష్టకు చేరడం వాస్తవమే అయినప్పటికీ దేశాన్ని స్వావలంబనతో నిలబెట్టడంలో ఆమె పాత్ర కాదనలేనిది. ఆ కాలంలో భారతదేశ అంతర్జాతీయ ప్రతిష్ట కూడా సమున్నతంగా ఉండేది. అందుకే మొన్న పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' విషయంలో హఠాత్తుగా అమెరికా అధ్యక్షుడి అస్పష్ట పాత్రతో కాల్పుల విరమణ జరిగిందన్న సమాచారం భారతీయులు జీర్ణం చేసుకోలేకపోయారు. దీనిపై పూర్తి వాస్తవాలు చెప్పేందుకు, ప్రత్యేక పార్లమెంట్ నిర్వహించడానికి మోడీ సర్కార్ వెనకాడుతున్నది. అయినా ఆయన విశ్వగురు అని, ప్రపంచాన్ని లోబర్చుకున్నారని ప్రచారార్భాటం మాత్రం ప్రహసన ప్రాయంగా సాగుతున్నది. ఎన్‌డిఎ భాగస్వాములుగా కీలక మద్దతుదార్లుగా ఉన్నందువల్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి వారు కూడా ఈ ప్రచారానికే వంత పాడుతున్నారు. పాలస్తీనా గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంతో పాటు ఇరాన్‌పై ఘోరమైన దాడికి పాల్పడుతున్నా ప్రశ్నించగల సత్తా మనకు లేకుండా పోయింది. మోడీకి ప్రపంచ పలుకుబడి గురించి పరవశించి చెప్పుకోవడమేగానీ ఆ దాడి నడిపిస్తున్న యూదు జాత్యహంకార నేత నెతన్యాహు ఫోన్ చేస్తే మోడీ గట్టిగా శాంతి కాంక్షను చెప్పలేకపోయారు. అయినా సరే మోడీ విశ్వగురువేనని నమ్మబలుకుతున్నారు.



తెలకపల్లి రవి

### విచిత్ర భాష్యాలు

నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన భారతదేశం మోడీ నాయకత్వంలో ప్రపంచ శక్తిగా ఎదుగుతున్నది కనుక అమెరికా హడలిపోతున్నదని విచిత్ర భాష్యాలు వినిపిస్తున్నారు. ఇరుగు పొరుగు దేశాలతోనూ, దక్షిణాసియా దేశాలతోనూ సంభాషణలు జరపకుండా సుదూర దేశాలకు ఆలస్యంగా అఖిలపక్ష బృందాలను పంపించి దౌత్య విజయాలు సాధించామని వేడుకలు చేసుకుంటున్నారు. సరిహద్దు సమస్యలు ఉన్నప్పటికీ భారత దేశంతో నిర్మాణాత్మకమైన సాధారణ సంబంధాలు పెంచుకోవడానికి సంసిద్ధం అంటున్నది చైనా మాత్రమే. దాన్నే ప్రధాన శత్రువుగా చూపించేందుకు సంఘపరివార్ చేసిన ప్రయత్నాలు, అమెరికా ఎగదోతలు విఫలమై ఇప్పుడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆ దేశానికి వెళ్తున్న పరిస్థితి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఇదంతా భారత దేశంలో కళ్ళ ముందు జరుగుతున్న తలకిందుల వ్యవహారంలో భాగమేనని ఇట్టే అర్థమవుతుంది. భారతదేశ జిడిపి 2025-26 తర్వాత జపాన్ కన్నా అతి కొద్దిగా పెరుగుదల చూపించే అవకాశం ఉందని ఐ.ఎం.ఎఫ్ ఎప్పుడో చెప్పింది కనుక ముందే కూసిన కోయిలల్లా ఇప్పటి నుంచే సంబరాలు హాస్యాస్పదంగా కనిపిస్తున్నాయి. భారతదేశంలో బడా మీడియా మోడియాగా లేక గోడిమీడియాగా మారిపోయి భజన కీర్తనలు ఆలపించడం అలవాటైందే కానీ ఈ మూడో దఫా ముచ్చటలో దాని తీరు మరీ తమాషాగా ఉన్నది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్ల హడావుడి కుప్పకూలి మోడీ మైనార్టీలో పడి పోయారనే వాస్తవాన్ని ఇప్పటికీ ఈ మీడియా జీర్ణం చేసుకోలేకపోతున్నది. అందుకే, అక్కడి నుంచే నరుక్కుని రావాలన్నట్టుగా ఇప్పుడు ప్రచారాలు ఎత్తుకున్నది.



**కిందపడి లేచి ఇదో విన్యాసం అన్న చందంగా వందిమాగధులు చెప్పిన అంశాలన్నీ వాస్తవంగా మోడీ సర్కారు ఇరకాటానికి అద్దం పడుతున్నాయి. లౌకిక ప్రతిపక్షాలు ఏకమయితే ఎక్కడ ముప్పు వస్తుందో అన్న భయంతోనే అంతా అనుకూలంగా మార్చివేయడంలో మోడీ ఘనతగా చాటుకుంటున్నారు. కానీ త్వరలో జరిగే బీహార్ శాసనసభ ఎన్నికలతో సహా రాజకీయ సవాళ్లు, ప్రజల పోరాటాలు బిజెపిని వెన్నాడుతున్నాయి. వరుసగా వస్తున్న అంతర్జాతీయ కుదుపులు, ఆర్థిక సవాళ్లు కూడా కొనసాగుతున్నాయి. ఒక్క ఏడాదికే ఇలా వుంటే మిగిలిన కాలం ఎలా వుంటుందనేది చూడవలసిందే. పైగా ఈ ఎదురుదెబ్బల తర్వాత సంఘ పరివార్ కూడా కేవలం మోడీకే అన్నీ వదలివేయకుండా తన జోక్యం పెంచడం చూస్తున్నదే.**

### లోటు భర్తీనా? తీవ్రమా?

ఉదాహరణకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక మొన్న మొదటి పేజీలో మోడీ 3.0 ప్రభుత్వం పరిస్థితులకు తగినట్టు మారిందని, ముందుకు పోతోందని కథనం ప్రచురించింది. బిజెపి దేశంలో పునఃశక్తివంతం కావటం, మరింతగా నిలదొక్కుకోవడం జరుగుతుందంటూ ఆ కథనం మొదలైంది. 2024 ఎన్నికల్లో మోడీ మొదటిసారిగా మిశ్రమ ప్రభుత్వ నేతగా ముందుకు వచ్చారట. వాస్తవానికి బిజెపికి మాత్రమే మెజారిటీ ఉన్నప్పటికీ గత రెండుసార్లు కూడా ఆయన ఇతర పార్టీల భాగస్వామ్యంతోనే అధికారంలోకి వచ్చారు. మెజారిటీ రాకపోవడం వల్ల మరింత ఏకాభిప్రాయ పూర్వకమైన సంప్రదింపుల ప్రక్రియతో పాలించవలసిన ఆవశ్యకత ఏర్పడిందని ఈ కథనం చెబుతున్నది. ఎన్డీఏలో విభిన్న భాగస్వామ్య పక్షాల ప్రయోజనాలకు చోటు కల్పించేందుకు ఒక కొత్త రాజకీయ ప్రక్రియను రూపొందించుకోవాల్సి వచ్చిందట. అయితే స్వల్ప కాలంలోనే రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లో విజయాలు సాధించడం ద్వారా బిజెపి తన ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పుకోగలిగిందని ఈ పత్రికతో సహా దాదాపు అన్ని జాతీయ పత్రికల్లోనూ ఒకే తరహా వాదన ముందుకు తీసుకురావడం వ్యూహాత్మక ప్రచార ఆయుధంగా స్పష్టమవుతుంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ కోల్పోయాక శాసనసభల ఫలితాలతో మళ్లీ పుంజుకోగలిగిందని, పోయింది రాబట్టుకోగలిగిందని ఇవి చెప్తున్నాయిగానీ తీసుకున్న కొలబద్దలు వేరుగా వున్నాయి. హర్యానాలో లోక్‌సభకు సగం అంటే ఐదు స్థానాలు మాత్రమే తెచ్చుకోగా శాసనసభలో 90కి 48 తెచ్చుకోవటం గొప్పగా చూపిస్తున్నారు. అయితే ఇక్కడ ఓట్ల శాతం మాత్రం గత శాసనసభ ఎన్నికలతో పోలుస్తున్నారు. ఇదే తరహాలో మహారాష్ట్ర, ఢిల్లీ, ఒడిస్సా శాసనసభల విజయాలను కూడా చూపిస్తున్నారు. ఈ రాష్ట్రాల్లో చాలాచోట్ల కాంగ్రెస్, ఇతర లౌకిక పార్టీలు సర్దుబాట్లు చేసుకోకపోవడంతో ఓట్ల చీలిక వల్ల బిజెపి గెలవగలిగింది. అలా చూస్తే ఓట్ల శాతంలో పెద్ద తేడా ఉండదు కనుక గత శాసనసభతో పోల్చి లెక్కలు చూపిస్తున్నారు. ఆఖరికి బిజెపి ఓడిపోయిన జమ్మూ కాశ్మీర్‌లో కూడా ఓట్ల శాతం పెరుగుదలను పెంచి చూపిస్తున్నది మీడియా. జార్ఖండ్‌లో ఓడిపోవడమే గాక 2024తో పోలిస్తే 14 శాతం ఓట్లు తగ్గాయి. కానీ గత శాసనసభతో పోల్చి 0.19 శాతం మాత్రమే తగ్గినట్టు చెప్తున్నది. మొత్తం మీద చూస్తే జార్ఖండ్ మినహా మిగిలిన అన్ని చోట్ల బిజెపి కోలుకుందని చెప్పడం ఈ విశ్లేషణల వ్యూహం. పైగా దీన్ని మరో విధంగా-తక్కువ ఓట్లతోనే ఎక్కువ సీట్లు తెచ్చుకోగల బిజెపి ప్రజ్ఞగా చిత్రిస్తున్నది.

### ఏకాదశ సూత్రాల తమాషా

చాలా ఇంగ్లీష్ పత్రికల్లో స్పాన్సర్డ్‌గా కనిపించే 'స్వరాజ్య' సంపాదకుడు ఆర్.జగన్నాథన్ 'మోడీ 11 ఏళ్లలో 11 మార్పులు' అని ఓ జాబితా ఇస్తూ తికమక పర్చే వ్యాఖ్యలు చేశారు. ♦ నెహ్రూ హయాంలో కూడా కాంగ్రెస్ రాష్ట్రాల స్థాయిలో హిందూ పార్టీగా ఉండేదని ముస్లింలను ఆదుకుంటూ మద్దతు పొందేదని మోడీ కూడా అదేవిధంగా అనుసరిస్తున్నారని ఈయన చెబుతున్నారు. ♦ మోడీ ఘనత దేశంలో మతపరమైన అస్తిత్వాన్ని నెలకొల్పడమేనని మైనార్టీలు ప్రతిపక్షం వైపు మొగ్గకుండా చూశారని చెప్తున్నారు. ♦ వక్ఫ్ బిల్లు ద్వారా బిజెపి తాను హిందుత్వ విధానాలకే కట్టుబడి ఉన్నానని, మైనార్టీలు ఈ మార్గానికి రాక తప్పదని సంకేతాలు ఇవ్వడం మరో ప్రత్యేకత. ♦ జగన్నాథన్ చెబుతున్న మూడో లక్షణం మరింతగా చెప్పుకోవలసింది. దేశంలోనే మొదటిసారిగా బిజెపి ఒక రాజకీయ పార్టీని కార్పొరేట్ పద్ధతిలో నడపవచ్చునని అగ్ర నాయకుడు సీఈఓ లాగా ఉంటే కార్యకర్తలు ఉద్యోగులుగా, సామాన్య ప్రజలు సభ్యులుగా కనిపిస్తున్నారని ఏదేదో వర్ణించారు. పైనుంచి కిందకు ప్రమోషన్లతో వినియోగ సరుకుల (ఎఫ్‌ఎం సిజి) తరహాలో రాజకీయం నడపవచ్చునని అర్థమైందట.♦ మోడీ దెబ్బకు భయపడటం వలనే అన్ని పార్టీలు ఉచితాల కోసం సిద్ధమైపోయాయట. ♦ రాజకీయ ప్రతికూలత ఉన్నప్పటికీ ఆర్థిక సంస్కరణలను కార్పొరేట్ తరహా నిర్ణయాలను ఆయన ఎలాగో కొనసాగించగలిగారట కానీ, ధనిక రైతుల ఆం దోళన వల్ల వ్యవసాయ రంగంలో చేయలేకపోయారట. ♦ పైన మోడీ అతి బలమైన నాయకుడుగా ఉన్నప్పటికీ రాష్ట్రాలలో యోగి, ఫడ్నవిస్, హిమంత బిశ్వ శర్మ వంటి బలమైన నాయకులు ఓట్లు పొందే పరిస్థితి కనిపిస్తుందట. తమిళనాడులో అన్నామలై కూడా ఈ కోవలోకొస్తాడట. ♦ ఈయన చెప్పే ఏడో అంశం జాతీయవాదాన్ని రాజకీయాల్లో మోడీ బలమైన అంశంగా ప్రవేశ పెట్టగలిగారట. ♦ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) చాలా శక్తివంతంగా తయారైందట. ఈ కారణంగా మొన్నటి ఎన్నికల్లో బిజెపి మంచి ఫలితాలు సాధించలేకపోయినా ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉపయోగించుకొని మళ్లీ పుంజుకుంటున్నదట. ♦ మోడీ-అమిత్ షా ల రూపంలో ఒకరికి ఇద్దరు నాయకులు ఉండటం చాలా ఉపయోగకరమని తేలిపోయిందట. ఈ ద్వయాన్ని ఆయన నెహ్రూ-పటేల్, వాజ్‌పేయి-అద్వానీ, మన్మోహన్-సోనియాగాంధీలతో పోలుస్తున్నారు. ♦ఉచితాలు పెరిగిపోవటంతో ప్రభుత్వాలు వ్యాపార వర్గాలకు అనుకూలమైన సంస్కరణలను చేయడం, చట్టాలు తేవడం కష్టంగా మారిందట. ♦ మోడీ సర్కారుకు అనుకూలంగా పది అంశాలు చెప్పిన జగన్నాథన్ చావు కబురు చల్లగా చెప్పినట్టు అసలు విషయం ఆఖరులో సెలవిస్తున్నాడు. ఉద్యోగాల కల్పన అనే అతి ప్రధానమైన జాతీయ సవాలు మోడీ పాలనలో అలాగే ఉండిపోయిందని ఒప్పుకోవడం కొసమెరుపు.

### మూల్యం తప్పదు

మోడీ పాలన లోని అసలు సమస్య కూడా ఈ పొగడ్తల్లోనే మనకు అర్థమవుతుంది. మెజార్టీ కోల్పోయిన బిజెపి ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి తంటాలు పడుతున్నది. వక్ఫ్ బిల్లు వంటివి కేవలం బిజెపి, సంఘ్ మత రాజకీయాల మేరకే ఆమోదం పొందుతున్నాయి. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' లాంటి విధానాలు ప్రాంతీయ పార్టీలకు పెద్ద సవాళ్లగా పరిణమిస్తున్నాయి. ఇతరులపై ఆధారపడినప్పటికీ సంఘపరివార్ ఒత్తిడితో బిజెపి నాయకత్వం తన సొంత భావజాలాన్ని, రాజకీయ ప్రాధాన్యతలను దేశంపై రుద్దుతున్నదని పై రాతలలోనే స్పష్టమవుతుంది. కిందపడి లేచి ఇదో విన్యాసం అన్న చందంగా వందిమాగధులు చెప్పిన అంశాలన్నీ వాస్తవంగా మోడీ సర్కారు ఇరకాటానికి అద్దం పడుతున్నాయి. లౌకిక ప్రతిపక్షాలు ఏకమయితే ఎక్కడ ముప్పు వస్తుందో అన్న భయంతోనే అంతా అనుకూలంగా మార్చివేయడంలో మోడీ ఘనతగా చాటుకుంటున్నారు. కానీ త్వరలో జరిగే బీహార్ శాసనసభ ఎన్నికలతో సహా రాజకీయ సవాళ్లు, ప్రజల పోరాటాలు బిజెపిని వెన్నాడుతున్నాయి. వరుసగా వస్తున్న అంతర్జాతీయ కుదుపులు, ఆర్థిక సవాళ్లు కూడా కొనసాగుతున్నాయి. ఒక్క ఏడాదికే ఇలా వుంటే మిగిలిన కాలం ఎలా వుంటుందనేది చూడవలసిందే. పైగా ఈ ఎదురుదెబ్బల తర్వాత సంఘ పరివార్ కూడా కేవలం మోడీకే అన్నీ వదలివేయకుండా తన జోక్యం పెంచడం చూస్తున్నదే. జెపి నడ్డా స్థానంలో నూతన అధ్యక్షుని ఎన్నిక పూర్తిగా తమకే వదలివేయవలసిందని ఆరెస్సెస్ ఆదేశించిందట. అనూహ్యమైన ఎంపిక జరిగినా ఆశ్చర్యం లేదని కీలక వ్యక్తులే చెబుతున్నారు. ఇంతగా ప్రేరేపించబడిన మతైక జాతీయవాద ధోరణులు కూడా ప్రభావం చూపిస్తాయి. ఇటీవల మోడీ పిలుపునిచ్చిన శాశ్వత యుద్ధం సిద్ధాంతం కూడా ఆందోళనకరంగా మారుతున్నది. అందుకే ప్రజాస్వామిక శక్తులు మరింత అప్రమత్తంగా వుండక తప్పదు. రాజకీయావసరాల కోసం మోడీకి వంత పాడుతున్న వారు కూడా అందుకు తగు మూల్యం చెల్లించవలసి వస్తుంది.

★

---


విశ్లేషణ

# కార్మిక చట్టాల సవరణ ఎవరి ప్రయోజనాల కోసం?



**కేం**ద్రంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వత్తాసు పలుకుతూ రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక చట్టాలకు సవరణలు చేసింది. కార్మికుల హక్కులకు నష్టం కలిగించడంలో వీరిద్దరిదీ ఒకే వైఖరి అని మరో సారి తేటతెల్లమైంది. అనేక సంవత్సరాలు కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలకు తూట్లు పొడుస్తూ పాలకులు ఈ విధానాలు తెచ్చారు. యజమానులు తమ వ్యాపారాలను తేలిగ్గా చేసుకునేందుకు ఈ మార్పులు తెస్తున్నామని కేంద్ర, రాష్ట్ర పాలకులు నిస్సిగ్గుగా చెబుతున్నాయి. దీనిపై ఇక తేల్చుకోవాల్సింది కార్మిక వర్గమే. పోరాడి సాధించుకున్న చట్టాలను తిరిగి ఐక్య పోరాటాల ద్వారానే నిలబెట్టుకోవాలి. కేంద్ర, రాష్ట్ర పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు, విశ్రాంతి, రాత్రి పూట పని చేయించడం తదితర అంశాల్లో చట్టాలకు తూట్లు పొడుస్తూ మార్పులు చేసింది. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" అమలు కోసం, యజమానులు తమ వ్యాపారాలను తేలిగ్గా చేసుకునేందుకు ఈ మార్పులు తెస్తున్నామని ప్రెస్ మీట్‌లో గౌరవ మంత్రివర్యులు ప్రకటించారు. ఈ సవరణలను పరిశ్రమలు, సంస్థలపై ప్రస్తుతం ఉన్న చట్టాల అమలు వల్ల కలిగే విధానపరమైన భారాన్ని తగ్గించడానికేనని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రకటించింది. తద్వారా తమ పెట్టుబడిదారీ వర్గ అనుకూల ధోరణిని బయటపెట్టారు. ఈ మార్పుల వలన రాష్ట్రంలోని ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పని చేసే 50 లక్షల మంది కార్మికులు నష్టపోతారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గత 13 సంవత్సరాలుగా షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో కనీస వేతనాల సవరణ చేయకపోవడం వలన వీరంతా ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. ఈ సవరణల ద్వారా మరింత దోపిడీకి గురవుతారు. ఆ మేరకు యాజమాన్యాలు లాభపడతాయి. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయడం లేదు. వీరెవరికీ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. దాదాపు 50 లక్షల మందిగా ఉన్న భవన నిర్మాణం, హమాలీ, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు, షాప్ ఎంప్లాయీస్ తదితర అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత సౌకర్యాలు అమలు కావడం లేదు. వీటిని పట్టించుకోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నేడు యాజమాన్యాల సౌలభ్యం కోసం ఈ మార్పులు తేవడం సరైనది కాదు. ఎన్నికల ముందు కార్మిక సంక్షేమం, సామాన్య ప్రజానీకం గురించి మాట్లాడి ఓట్లు వేయించుకున్న తెలుగుదేశ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈ మార్పులు తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సంఘాలకు అతీతంగా కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను తెలపాలి.



ఎ.వి. నాగేశ్వరరావు

**వారంలో పని గంటలు 48 గానే యథాతథంగా ఉంటాయని (రోజుకు 8 గంటలు X 6 రోజులు), చెబుతున్నా ఆచరణలో కార్మికుడిపై పని గంటలు, పని భారం పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న రోజుకు 8 గంటల పనిని మార్చే హక్కు ప్రభుత్వానికి లేదు. 8 గంటల పనిని డబుల్ వేతనంతో ఓటి చేయించుకోవాలన్నా కూడా కార్మికుడి రాతపూర్వక ఒప్పందం ఉండాలి. ఇదేదీ లేకుండా రోజువారీ పని గంటల్లో ఏకపక్షంగా పై మార్పులు చేయడం యాజమాన్యాల ప్రయోజనం కోసమే.**

ఫ్యాక్టరీల చట్టం సెక్షన్ 54ను సవరించి ప్రస్తుతం విరామంతో సహా ఉన్న 9 గంటల పనిని 10 గంటలకు పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలో షాపులకు సంబంధించి సెక్షన్ 9, సంస్థలకు సంబంధించి సెక్షన్ 16ను సవరించి అవసరాన్ని, సీజన్‌ను బట్టి రోజుకు 8 గంటల పనిని 10 గంటల వరకూ పెంచవచ్చన్నారు.

వారంలో పని గంటలు 48 గానే యథాతథంగా ఉంటాయని (రోజుకు 8 గంటలు X 6 రోజులు), చెబుతున్నా ఆచరణలో కార్మికుడిపై పని గంటలు, పని భారం పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న రోజుకు 8 గంటల పనిని మార్చే హక్కు ప్రభుత్వానికి లేదు. 8 గంటల పనిని డబుల్ వేతనంతో ఓటి చేయించుకోవాలన్నా కూడా కార్మికుడి రాతపూర్వక ఒప్పందం ఉండాలి. ఇదేదీ లేకుండా రోజువారీ పని గంటల్లో ఏకపక్షంగా పై మార్పులు చేయడం యాజమాన్యాల ప్రయోజనం కోసమే.

ఫ్యాక్టరీల చట్టం సెక్షన్ 55, ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలో షాపులకు సెక్షన్ 10, సంస్థలకు సెక్షన్ 17లను సవరించి 5 గంటల పని అనంతరం విరామం పొందేందుకు ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని 6 గంటల పాటు పని చేసిన తర్వాత మాత్రమే విరామం ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కార్మికుడి ఆరోగ్యానికి నష్టం కలిగిస్తుంది. ఆరోగ్య సూత్రాల ప్రకారం ప్రతి 3 గంటలకోసారి అల్పాహారమో / పూర్తి ఆహారమో / తేనీయాలో తీసుకోవాలి. దాన్ని కూడా ఈ సవరణల ద్వారా నిరాకరించడం అమానుషం.

ఫ్యాక్టరీల చట్టం సెక్షన్ 56లో భోజన విరామం, ముందుగా తెలియని / నిరోధించలేని ఏదైనా అత్యవసర పరిస్థితులలో కార్మికుని 8 గంటల పనిని 10.30 గంటల్లో విస్తరించవచ్చన్న నియమాన్ని సవరించి ఇప్పుడు 12 గంటలుగా మార్చారు. అంటే అంతకు ముందు అవాంతరాలతో కలిపి 2.30 గంటలుగా ఉన్న విరామం ఇప్పుడు 4 గంటలుగా మారుతుంది. అలాగే షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలో షాపులకు సంబంధించి సెక్షన్ 11, సంస్థలకు సంబంధించి సెక్షన్ 18లో ఉన్న అన్ని విరామాలతో కలిపి 8 గంటల పనిని 12 గంటల్లో విస్తరించవచ్చన్న నియమం కొనసాగుతుంది. పని గంటలు పెరిగినా విరామాలతో కలిపి 12 గంటలు మించవన్న లేబర్ కమిషనర్ వివరణ అంగీకరించరానిది. ఒకవైపు విరామాన్ని గంట పెంచడం మరియు 8 గంటల పని విస్తరణను మరో 2 గంటలు పెంచడం వలన కార్మికులు నష్టపోతారు. తమ కుటుంబాలతో గడపడానికో / ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవాడానికో వినియోగించాల్సిన కాలాన్ని ఫ్యాక్టరీలో వెచ్చించాల్సి వస్తుంది. ఆ మేర కార్మికులకు మానసికంగా ఇబ్బంది కలుగుతుంది.

గతంలో ప్రతి మూడు నెలలకు 50 నుండి 75 గంటలు అదనంగా కార్మికుని రాతపూర్వక అనుమతితో ఓటి చేయించుకోవచ్చు. ఇప్పుడు ఆ ఓటి కాలాన్ని 144 గంటలకు పెంచారు. దీని వలన కార్మికునిపై పని భారం, పని ఒత్తిడి పెరుగుతాయి. కొత్త వారికి ఉపాధి తగ్గుతుంది. ఈ మేరకు యాజమాన్యాలు లాభపడ్డానికే ఈ ప్రతిపాదన తెచ్చారు.

ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ 66 ప్రకారం మహిళా కార్మికులతో రాత్రి 7 గంటల తర్వాత, ఉదయం 6 గంటల్లోపు పని గంటల్లో నియమించకూడదు. అయితే ఈ సెక్షన్ ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉందని గతంలో చాలా రాష్ట్రాల్లో హైకోర్టులు కొట్టేశాయి. మహిళలకు కూడా పని ప్రాథమిక హక్కుగా కల్పించాలనే ఉద్దేశంతో కోర్టులు మహిళలకు తగిన భద్రత, రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించి వారి అంగీకారంతో రాత్రి షిప్టుల్లో పని చేయించుకోవాలని తీర్పులిచ్చాయి. మహిళా సంఘాలు కూడా ఈ పని హక్కుకు మద్దతునిచ్చాయి. 2015, 2022లో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు తీర్పుకు అనుగుణంగా యజమాని తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ పేర్కొంటూ సర్క్యులర్‌ను (25.10.2022న) జారీ చేశారు. ఆ నిబంధనల ప్రకారం మహిళా కార్మికులు రాతపూర్వకంగా అంగీకారం తెలపాలి. ప్రసూతి సెలవు నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయించాలి. పనికి వచ్చేటప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలి. పని ప్రదేశాల్లో టాయిలెట్లు, మంచినీరు, రక్షణ, తదితర సౌకర్యాలన్నీ కల్పించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. లైంగిక వేధింపుల చట్టం అమలు చేయాలి. కానీ చాలా ప్రదేశాల్లో ఇవేవీ అమలు కాని పరిస్థితి ఉన్నది. ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణే లేదు. పెట్టుబడిదారులకు అనుకూలంగా నయా ఉదారవాద విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు వీటి పర్యవేక్షణకు తగిన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయని దుస్థితి నేడు నెలకొంది. ఫ్యాక్టరీల్లో వరుస ప్రమాదాలు జరిగి కార్మికులు, ప్రజలు చనిపోతున్నా పట్టించుకోని పరిస్థితి మన కళ్ల ముందుంది. ఈ నేపథ్యంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పించి రాత్రిపూట పని చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించినా ఆ చరణలో దానికి తగ్గ ఏర్పాట్లు నేడు రాష్ట్రంలో లేవు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర క్యాబినెట్ ఈ సవరణ చేయడం దుర్మార్గం. పై నిబంధనలన్నింటి అమలు గ్యారంటీ చేశాకే, దానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయకుండా ఈ నిర్ణయం సరైనది కాదు.

పై సవరణలతో పాటు ఇప్పటికే రాష్ట్రంలో లేబర్ కోడ్స్‌కు అనుగుణంగా పారిశ్రామిక వివాదాల పరిష్కారం కోసం కార్మికులు దరఖాస్తు చేసుకోవాల్సిన కాలాన్ని మూడు సంవత్సరాల నుండి రెండు సంవత్సరాలకు తగ్గించారు. మూడు సంవత్సరాల కాలం అయితే వివాదాలు పెరుగుతున్నాయని, ఇవి తగ్గడానికంటూ రెండు సంవత్సరాలకు కుదించింది. కార్మికులు సమ్మె చేయాలంటే అత్యవసర సర్వీసుల్లో 14 రోజుల ముందు నోటీసునివ్వాలి. దీన్ని అత్యవసరం కాని సేవల్లో కూడా ఈ 14 రోజుల నోటీసునివ్వాలని సవరణలు తెచ్చారు. జరిమానాలకు సంబంధించి యాజమాన్యాలు చిన్నపాటి జరిమానాలతో తప్పించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ చట్టం సవరించారు. చట్టాల ఉల్లంఘనపై యాజమాన్యాలపై కోర్టులకు వెళ్లకుండా, వారు ఇబ్బందులు పడకుండా అప్పటికప్పుడు చిన్నపాటి జరిమానాలు కట్టి తప్పించుకునేలా వెసులుబాటు కల్పించారు.

కనీసం కార్మిక సంఘాలతో కూడా చర్చించకుండా ఈ ప్రతిపాదనలు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం దుర్మార్గం. పూర్తిగా కార్మిక వ్యతిరేకమైన ఈ ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకునేలా కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలి. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళ మినహా కేంద్రంలో, మనతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక సవరణలు చేయడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారింది. కర్ణాటకలో అంతకు ముందున్న బిజెపి ప్రభుత్వం వారపు పనిగంటలు 48 గానే ఉంచి, రోజువారీ పని గంటలను అవసరాన్ని బట్టి పెంచుకోవడమో లేదా తగ్గించుకోవడమో చేయవచ్చని చట్టాన్ని మార్చింది. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని కొనసాగిస్తోంది. ఆ బాటలోనే నేడు తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పయనిస్తోంది. కేంద్రంలో బిజెపి కార్మిక చట్టాల సవరణలతో తెచ్చిన లేబర్ కోడ్స్‌కు పార్లమెంట్‌లో తెలుగుదేశం, వైసిపి లు అమోదం తెలిపాయి. పార్లమెంట్‌లో వామపక్షాలు వ్యతిరేకించాయి. కార్మిక హక్కులను హరించడంలో మిగిలిన పార్టీల విధానం ఒక్కటే. దీన్ని కార్మికవర్గం గమనించాలి. వీటికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి. ఈ సవరణలను తిప్పి కొట్టాలి. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను రాష్ట్రంలో జయప్రదం చేయాలి. జులై 9న పెద్ద ఎత్తున అన్ని మండలాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో వేలాదిగా నిరసనలు తెలపాలి.

**/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు /**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
editpageps @ gmail.com

# విమానాల్లో ప్రత్యేక తనిఖీలు

- ప్రమాదంపై అంతర్గత ఆడిట్ • సమీక్షకు ఎయిరిండియా చైర్మన్, సిఇఓ సిద్ధం
- ఇప్పటికే తొమ్మిది బోయింగ్ విమానాల్లో తనిఖీలు పూర్తి
- నిర్వహణకు బోర్డుకు ఆదేశం • సోదాల వల్ల విమానాలు ఆలస్యం
- ఉన్నత స్థాయి కమిటీ వేసిన ప్రభుత్వం • 274కి పెరిగిన మృతులు

**న్యూఢిల్లీ:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై యావత్ ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎయిరిండియా బోర్డు అప్రమత్తమైంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఎయిర్ ఇండియాకు చెందిన అన్ని విమానాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

తమ వద్ద గల 26 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లలో తొమ్మిదింటిలో భద్రతాపరమైన తనిఖీలు పూర్తి చేశామని ఎయిర్ ఇండియా సంస్థ శనివారం తెలియజేసింది. డిజిసిఎ ఆదేశాల మేరకు మిగిలిన విమానాలలో కూడా తనిఖీలు పూర్తి చేస్తామని చెప్పింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో భద్రతాపరమైన తనిఖీలు పెంచాలని డిజిసిఎ ఇప్పటికే ఆదేశించింది. ఎయిర్ ఇండియా వద్ద 26 బోయింగ్ 787-8, ఏడు బోయింగ్ 787-9 విమానాలు ఉన్నాయి. కొన్ని విమానాల్లో తనిఖీలకు చాలా సమయం పడుతుందని, దీంతో సుదూర ప్రయాణాలలో జాప్యం జరుగుతుందని, ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తామని ఎయిర్ ఇండియా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది. మరికొన్ని విమానాలు విదేశాలలో ఉన్నందున అవి తిరిగి రాగానే తనిఖీలు చేపడతామని, ఆ తర్వాత తదుపరి ప్రయాణానికి అనుమతిస్తామని వివరించింది.

**274కి పెరిగిన మృతులు**

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ-171 విమానం రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 274కు పెరిగింది. హాస్టల్ భవనంపై పడిన విమానం తోక భాగంలో ఒక మృతదేహం ఇరుక్కున్నట్లు కనుగొన్నారు. దాన్ని ఎయిర్‌హోస్టెస్ మృతదేహంగా గుర్తించారు.

**అంతర్గత ఆడిట్**

ఇంతమంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అంతర్గత ఆడిట్ నిర్వహించాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

విమానాల కండీషన్, వాటి నిర్వహణ పద్ధతులు, ఇలా వివిధ శాఖలపై సమీక్షకు ఎయిరిండియా చైర్మన్, సీఈఓ సిద్ధమయ్యారు. భద్రతా ఆడిట్ నిర్వహణకు ఎయిరిండియా బోర్డును ఆదేశించారని తెలుస్తోంది. ఈ ఘటనపై మరో విచారణ చేపట్టనుంది. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, వారికి సమగ్ర శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి పెట్టింది. విమాన ప్రమాదంపై అన్ని దర్యాప్తు సంస్థలకు సహకరిస్తామని ఎయిరిండియా పేర్కొంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన కేంద్రం వ్యవహరిస్తోందని విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత బంధువులు విమర్శిస్తున్నారు.


డిఎన్ఎ నిర్ధారణ అయిన తరువాత అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రి వద్దకు చేరుకున్న మృతదేహాలు

**ఇంకా లభించని కాక్‌పిట్ వాయిస్‌రికార్డర్**

విమానానికి చెందిన ఫ్లయిట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డిఆర్) శుక్రవారం సాయంత్రం లభించింది. ప్రమాదం జరిగినప్పుడు ఏం జరిగిందన్న విషయంపై అది సమాచారాన్ని అందిస్తుంది. విమానంలో ఉండే బ్లాక్ బాక్సులలో ఎఫ్‌డిఆర్ ఒకటి. విమాన సమాచారాన్ని అది రికార్డు చేస్తుంది. మరో బ్లాక్ బాక్స్ అయిన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సివిఆర్) ఇంకా లభించలేదు. ఎఎఐబి అధికారులు ఘటనా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని ఆధారాలు సేకరిస్తున్నారు.

**అదనంగా రూ.25 లక్షలు**

విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా సన్స్ ప్రకటించిన రూ. కోటి నష్టపరిహారానికి అదనంగా మరో రూ.పాతిక లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని ఎయిర్ ఇండియా తెలిపింది.

**మృతులకు, క్షతగాత్రులకు ఆర్థిక సాయం : టాటాకు ఐఎంఎ లేఖ**

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన బిజె మెడికల్ కాలేజీ హాస్టల్లోని విద్యార్థులకు, క్షతగాత్రులకు ఆర్థిక సహాయం అందించాలని టాటా సన్స్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) కోరింది. ఈ మేరకు టాటా సన్స్ చైర్మెన్ ఎన్.చంద్రశేఖరన్‌కు లేఖ రాసింది.

'ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన మెడికల్ కళాశాల విద్యార్థుల కుటుంబాలకు, గాయపడిన విద్యార్థులకు పరిహారం, సహాయాన్ని అందించాలని అభ్యర్థిస్తున్నాం" అని ఐఎంఎ లేఖలో పేర్కొంది. ప్రయాణికులు, సిబ్బందితో పాటు ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని టాటా గ్రూప్ ఇది వరకే ప్రకటించింది. ఆ పరిహారాన్ని చనిపోయిన విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని ఐఎంఎ విజ్ఞప్తి చేసింది.

**బ్రిటన్ జాతీయుల కోసం అహ్మదాబాద్‌లో యూకే రిసెప్షన్ సెంటర్**

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 53 మంది బ్రిటన్ జాతీయులు మరణించిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలు, స్నేహితులకు సహాయాన్ని అందించడానికి భారత్‌లోని బ్రిటిష్ హైకమిషన్ విమానాశ్రయానికి సమీపంలోని రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ రిసెప్షన్ సెంటర్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుందని హైకమిషన్ ట్వీట్ చేసింది.

**11మంది డిఎన్ఎ నమూనాలు మ్యాచ్**

11మంది బాధితుల డిఎన్ఎ నమూనాలు మ్యాచ్ అయ్యాయని అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రి హెడ్ రజనీష్ పటేల్ తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకున్న అనంతరం ఒక మృతదేహాన్ని వారి కుటుంబానికి అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

**ఎస్ఓపిపై దృష్టిపెట్టనున్న ఉన్నత స్థాయి కమిటీ**

కేంద్ర హోం శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి సమగ్ర మార్గదర్శకాలను సూచిస్తుంది. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపి)ని రూపొందించడంపై ఈ కమిటీ దృష్టి పెడుతుంది.

## లీగల్ యాక్షన్‌కు సిద్ధంగా ఉండండి

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం డబ్బులు తన జేబులోకి వెళ్లాయంటూ చేసిన ఆరోపణలపై లీగల్ యాక్షన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. తనపై చేసిన ఆరోపణలను 24 గంటల్లో నిరూపించాలని ఛాలెంజ్ చేశానని, ఆ సమయం ముగిసిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శనివారం పేర్కొన్నారు. రుజువు చెయ్యలేదని, క్షమాపణ కోరలేదని తెలిపారు. బురదచల్లడం పారిపోయి దాక్కోవడం జగన్‌కు అలవాటు అని, అందుకే అతనని ఫేక్ అనేదని విమర్శించారు. 'సమయం లేదు మిత్రమా, శరణమా న్యాయ సమరమా? తేల్చుకోండి' అంటూ పేర్కొన్నారు.



## నీట్ ఫలితాల్లో అగ్రస్థానంలో శ్రీచైతన్య

ప్రజాశక్తి - హైదరాబాద్

జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-2025) ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో శ్రీచైతన్య విద్యాసంస్థ అగ్రస్థానంలో నిలిచింది. శ్రీచైతన్య తరగతి గది విద్యార్థి కావిష్‌కు అఖిల భారత స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ ఆలిండియా ప్రథమ ర్యాంకుతోపాటు ఐదో ర్యాంకు దివ్య, ఆరో ర్యాంకు మహమ్మద్ సమీర్, ఎనిమిదో ర్యాంకు ధీరజ్‌కుమార్, పదో ర్యాంకు మంగరి వరుణ్ సాధించారని వివరించారు. అఖిల భారత స్థాయిలో టాప్ పదిలోపు ర్యాంకుల్లో ఐదు శ్రీచైతన్య విద్యార్థులు సాధించారని చెప్పారు. నీట్‌లో ఎప్పటికీ తమ విద్యాసంస్థ అగ్రస్థానమని మరోసారి విద్యార్థులు నిరూపించారని అన్నారు. నాణ్యమైన శిక్షణను అందిస్తూ అనితర సాధ్యమైన ప్రోగ్రామ్‌లు, మైక్రో షెడ్యూళ్లు, ఇంటర్నల్ పరీక్షలు, ర్యాంకింగ్‌ల విధానం, దేశంలోనే టాప్ ఫ్యాకల్టీగా కారణంగానే సాధ్యమయ్యాయని వివరించారు. నీట్-2026కు సరికొత్త ఏఐ టెక్నాలజీతో లాంగ్‌టర్మ్ శిక్షణ ఇస్తామని ప్రకటించారు. అందుకే దేశవ్యాప్తంగా విద్యార్థులు శ్రీచైతన్యనే అని అన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు.



## మధ్యప్రదేశ్ బాలాఘాట్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టులు మృతి

**బాలాఘాట్, భువనేశ్వర్:** బిత్లీ చౌకి పరిధిలోని పచామా దాదర్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో శనివారం మరోసారి పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. నలుగురు మావోయిస్టులు మరణించగా, వారిలో ముగ్గురు మహిళలే ఉన్నట్టు సమాచారం. బాలాఘాట్‌కు కొత్తగా నియమితులైన ఎస్‌పి ఆదిత్య మిశ్రా ఎన్‌కౌంటర్‌ను నిర్ధారించారు. ప్రస్తుతం పోలీసుల కూబింగ్ జరుగుతోందని తెలిపారు.

**ఒడిశాలో ఐఇడి పేలి సిఆర్‌పిఎఫ్ అధికారి మృతి**

ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో శనివారం మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తుండగా ఐఇడి పేలి, సిఆర్‌పిఎఫ్ అధికారి ఎఎస్ఐ సత్యబాన్ కుమార్ సింగ్(34) మరణించారు. ఆయన స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఖుషినగర్ జిల్లా. రూర్కెలాలోని కె బాలంగ్ గ్రామ సమీపంలోని అడవుల్లో సిఆర్‌పిఎఫ్ జవాన్లు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీసులు కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన కుమార్‌సింగ్‌ను రూర్కెలాలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు.

## పాలస్తీనాపై యుఎన్ సమావేశం వాయిదా

**పారిస్ :** పాలస్తీనాపై ఐక్యరాజ్య సమితి నిర్వహించాల్సిన ఉన్నత స్థాయి సమావేశం వాయిదా పడింది. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెచ్చరిల్లిన నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా ఈ నెల 17 నుంచి 20 వరకూ జరగాల్సిన ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ తెలిపారు. పాలస్తీనా ప్రతినిధులు కొంతమంది ఈ సమావేశానికి రాలేకపోతున్నారని తెలిపారు. సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో చర్చిస్తున్నామని, సాధ్యమైనంత త్వరలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఫ్రాన్స్, సౌదీ అరేబియా అధ్యక్షతన ఈ సమావేశం జరిగితే దీర్ఘకాలంగా స్తంభించిపోయిన శాంతి ప్రక్రియ పునరుద్ధరించబడుతుందని పాలస్తీనా అథారిటీ ఆశించింది.

## ఇజ్రాయిల్ దాడులు సరికాదు

- ఖండించిన షాంఘై సహకార సంస్థ

**న్యూఢిల్లీ,దుబాయ్ ::** మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెచ్చరిల్లడంపై సభ్య దేశాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు షాంఘై సహకారం సంస్థ (ఎస్‌సిఓ) పేర్కొంది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ పాల్పడిన సైనిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపింది. ఎస్‌సిఓకు చైనా ప్రస్తుతం చైర్మన్‌గా వుంది. పౌర లక్ష్యాలపై, ఇంధన, రవాణా వసతులపై ఇజ్రాయిల్ దూకుడుగా పాల్పడిన దాడులతో పౌరులు మరణించారని, ఇది అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని ఉల్లంఘించడమేనని ఎస్‌సిఓ పేర్కొంది.

ఇది ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తుందని విమర్శించింది. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతలకు ముప్పుగా మారుతుందని పేర్కంది,. ఇరాన్ అణు కార్యక్రమం చుట్టూ నెలకొన్న ఈ పరిస్థితులను శాంతియుతంగా, రాజకీయంగా, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని ఎస్‌సిఓ కోరుతోందని ఆ ప్రకటన పేర్కొంది.

**భారత్ వైఖరిలో మార్పు లేదు !**
**చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకోవాల్సిందే**

ఇజ్రాయిల్ - ఇరాన్ పరిస్థితిపై తాము గతంలో పేర్కొన్న వైఖరికే కట్టుబడ్డామని భారత్ శనివారం స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు, దౌత్య మార్గాలను ఉపయోగించాల్సిందిగా అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయిల్ మిలటరీ చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ షాంఘై సహకార సంస్థ ఒక ప్రకటన జారీ చేసిన నేపథ్యంలో భారత్ పై విషయం తెలిపింది. తాజా పరిణామాలపట్ల తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు భారత్ శుక్రవారం తెలిపింది. రెచ్చగొట్టే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని ఇరు పక్షాలకు విజ్ఞప్తి చేసింది.

**ఇక అమెరికాతో అణు చర్చలు పనికిమాలిన పని!**
**ఇరాన్ వ్యాఖ్యలు**

తమ దేశంపై ఇజ్రాయిల్ దాడులకు తెగబడిన తర్వాత ఇక అమెరికాతో అణు చర్చలను కొనసాగించడం అర్థరహితమని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె శనివారం వ్యాఖ్యానించారు. ఆదివారం మస్కట్‌లో ఇరు దేశాల మధ్య చర్చలు జరగాల్సి వుంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో బాఘె చేసిన వ్యాఖ్యలతో ఈ చర్చలు సందేహంలో పడ్డాయి. చర్చలు జరపడాన్ని పనికిమాలిన అంశంగా అమెరికా మార్చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ గీసిన లక్ష్మణ రేఖలన్నింటినీ ఇజ్రాయిల్ దాటేసిందని దాడులకు తెగబడడం ద్వారా క్రిమినల్ చర్యకు దిగిందని చెప్పారు. చర్చలు రద్దు అనే మాట ఉపయోగించకుండా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## న్యూయార్క్ జైల్లోకి ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లకు అనుమతి నిరాకరణ

- తాత్కాలిక నిషేధాజ్ఞలు జారీ చేసిన న్యాయమూర్తి

**న్యూయార్క్:** నగరంలోని రైకర్స్ ఐలాండ్ జైల్లోకి ఇమ్మిగ్రేషన్ అధికారుల కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు న్యాయమూర్తి మేరీ రోసాడో అనుమతి నిరాకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ ఇమ్మిగ్రేషన్ అధికారులను (ఐసిఇ) జైలుకు తిరిగి రానివ్వాలని ఆదేశాలు జారీ చేశారు.నగర కౌన్సిల్ సభ్యులు దీన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారు. ఇది "అవినీతి ఒప్పందం" అని,మేయర్ తనపై ఉన్న అవినీతి కేసును మాఫీ చేయించుకోవడానికి ప్రభుత్వ పెద్దలతో రహస్య ఒప్పందం చేసుకున్నాడని వారు ఆరోపించారు.విచారించిన న్యాయమూర్తి కూడా ఇదే అనుమానం వ్యక్తం చేశారు.అయితే ఆడమ్స్ తను ఎలాంటి రహస్య ఒప్పందం చేసుకోలేదని,ఇది హింసాత్మక ముఠాలను నిలువరించేందుకని ప్రకటించారు. మేయర్ పదవికి పోటీ పడుతున్న నగర కౌన్సిల్ స్పీకర్ అడ్రియేన్ ఆడమ్స్ ఈ తీర్పును స్వాగతించారు.ఇది ప్రజా విజయమని అభివర్ణించారు." మేయర్ ఆడమ్స్ తన వ్యక్తిగత స్వలాబం కోసం ప్రజల హక్కులను అమ్మేసేందుకు ప్రయత్నించాడు" అని ఆరోపించారు.అయితే ఈ కేసు ఇంకా కొనసాగుతోందని,మేయర్ అప్పీల్ కు వెళ్లె అవకాశముందని అదికార వర్గాలు వెల్లడించాయి.

## యోగాసనాలు కాదు .. రోడ్లు వేయండి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మూలన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఫారెస్టు అధికారుల ఆటంకంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదన్నారు. విజన్ - 2047 పేరిట కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, గిరిజనోద్ధరణ పేరిట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. గిరి గ్రామాల్లో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయన్నారు. పాలబంద గిరిజనుల కష్టాలు గుర్తించి జిల్లా కలెక్టర్ రోడ్లు మంజూరు చేసినప్పటికీ అటవీ అధికారుల వైఖరితో వారం రోజులుగా పనులు ముందుకు సాగడం లేదన్నారు. దీంతో రోడ్ల నిధులు వెనక్కు వెళ్లిపోయే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో చేదల రాంబాబు, వంతల గుండుబాబు, తామర్ల ఈశ్వరరావు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్, ఇరాన్ భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

చిన్నారులు వున్నారని ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి తెలిపారు. 320మందికి పైగా గాయపడ్డారని చెప్పారు. ఇరాన్ క్షిపణుల దాడుల్లో నలుగురు మరణించారని, ఏడుగురు సైనికులతో పాటు 70మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ మిలటరీ ప్రతినిధి శనివారం చెప్పారు. సెంట్రల్ ఇజ్రాయిల్‌లో నివాస భవంతులపై పడిన క్షిపణులతో ఇద్దరు మరణించగా, 21మంది గాయపడ్డారని మీడియా తెలిపింది. టెల్‌అవీవ్ సమీపంలో ఈ దాడుల వల్ల జరిగిన నష్టం, విధ్వంసం దృశ్యాలను మీడియా ప్రచురించింది. అపార్ట్‌మెంట్‌లు పూర్తిగా ధ్వంసమై, అనేక వాహనాలు శిధిలాల్లో కూరుకుపోవడం కనిపిస్తోంది.

**ఇరాన్ గగనతలం మూసివేత**

దేశ గగనతలాన్ని మూసివేసినట్లు ఇరాన్‌పౌర విమానయాన శాఖ అధికారులు ప్రకటించారు. తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు దేశంలోని ఏ విమానాశ్రయంలోనూ విమానాలు నడవవని, ప్రయాణికుల ప్రాణాలను కాపాడడమే లక్ష్యమని అధికార ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. గతరాత్రి జరిగిన పరిమిత దాడులతో ఈ ఘర్షణలు ఆగిపోవని, ఇరాన్ దాడులు కొనసాగుతాయని మిలటరీ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ తెలిపింది.

**అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ స్థావరాలపైనా దాడులు చేస్తాం : ఇరాన్**

ఇజ్రాయిల్‌పై తమ దాడులను ఆపేందుకు ప్రయత్నిస్తే, ఇజ్రాయిల్‌కు సహకరిస్తే పశ్చిమాసియాలోని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు చెందిన స్థావరాలను, నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది.

**టెహరాన్‌ను తగలబెడతాం : ఇజ్రాయిల్ రక్షణ మంత్రి**

శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారు జామున జెరూసలేం గగన తలంలో పేలుళ్లు, సైరన్ల శబ్దాలతో ప్రజలకు తెల్లవారింది. ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లోనే వుండాలని, బయటకు ఎవరు రావద్దని ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్షిపణి దాడులు ఇలాగే కొనసాగితే టెహరాన్‌ను తగలబెడతామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌తో సమావేశం అనంతరం రక్షణమంత్రి కట్జ్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ పౌరులకు కలిగిస్తున్న నష్టానికి ఇరాన్ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వుంటుందని హెచ్చరించారు.

**దాడులకు ఇజ్రాయిల్ వైమానిక దళం సిద్ధం**

టెహరాన్‌పై వైమానిక దాడులకు సిద్ధంగా వున్నామని ఇజ్రాయిల్ ఐడిఎఫ్ శనివారం ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన తొమ్మిది మంది అణు శాస్త్రవేత్తలు మరణించారని, దీనివల్ల అణు బాంబు తయారీ సామర్థ్యాలను సముపార్జించుకోవాలన్న ఇరాన్ ఆలోచనలకు ఎదురు దెబ్బ తగిలిందని మిలటరీ వ్యాఖ్యానించింది.



## విద్యుత్ ప్రయివేటీకరణకు స్మార్ట్ మీటర్ల ముసుగు

(మొదటి పేజీ తరువాయి)

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం బాటలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తూ కార్మిక వర్గానికి హాని చేసే విధంగా 10 గంటలకు పని గంటలు పెంచుతూ నిర్ణయం చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మహసభలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి పాల్గొని సౌహార్ధ సందేశం అందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి కార్యదర్శి నివేదిక ప్రశపెట్టారు. సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, యునైటెడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముజఫర్ అహ్మద్, యుఇఇయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.నాగబ్రహ్మాచారి, వి.సత్యనారాయణ, పి.ప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లో నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ఏడు విమానాల భద్రతపై సమీక్ష జరిగిందని చెప్పారు. ఈ సిరీస్‌ను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. విమాన ప్రమాదం తననెంతో షాక్‌కు గురిచేసిందని, రోడ్డు ప్రమాదంలో తన తండ్రిని కోల్పోవడం వల్ల ఆ బాధ తనకు తెలుసని, బాధిత కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నానని, అండగా ఉంటామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం బ్లాక్‌బాక్స్ దొరికిందని తెలిపారు. బ్లాక్‌బాక్స్‌ను డీకోడ్ చేసిన తరువాత మరింత సమాచారం తెలుస్తుందని పేర్కొన్నారు.

విమానం టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోనే ప్రమాదం జరిగిందని అన్నారు. ఎయిర్‌పోర్టుకు రెండు కిలోమీటర్ల దూరంలో 650 అడుగుల ఎత్తులో విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో పైలట్ మేడే కాల్ చేశారని అన్నారు. విమాన సిబ్బందిని ఎటిసి సంప్రదించినా స్పందన రాలేదని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే గుజరాత్ ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన శాఖ స్పందించాయని తెలిపారు. వెంటనే మంటలార్పి లభ్యమైన మృతదేహాలను అక్కడి నుంచి తరలించామని పేర్కొన్నారు.

## ఈత నేర్చుకున్నాను




హాయ్ ఫ్రెండ్స్,
నా పేరు అభినవ్. కుంచనపల్లి అరవింద హైస్కూల్లో మూడో తరగతి చదువుతున్నాను. నాకు ఈత నేర్చుకోవడం అంటే చాలా ఇష్టం. ఈ వేసవి సెలవుల్లో ఈత నేర్చుకున్నాను. భలే సరదాగా అనిపించింది. అంతకు ముందు ఒకసారి నేను రాజమండ్రి వెళ్లినప్పుడు మామయ్య గోదావరి నదికి తీసుకెళ్లారు. అక్కడ నీళ్లల్లోకి దిగుతానని చాలా మారాం చేశాను. అప్పుడు 'అది చాలా ప్రమాదమని, ఈత నేర్చుకుంటేనే నీళ్లల్లోకి వెళ్లాలని, లేకపోతే మునిగిపోతామని అమ్మ చెప్పింది. అప్పుడే ఎలాగైనా ఈత నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. సెలవులు రాగానే ఉండవల్లి ఆక్వా డెవిల్స్‌లో కోచింగ్‌కి అమ్మానాన్న నా పేరు నమోదు చేశారు. మే 4 నుండి స్విమ్మింగ్ క్లాసులు మొదలుపెట్టారు. తెల్లవారుజామున 4:30కి అమ్మ నిద్రలేపేది. 5 గంటలకల్లా నాన్న శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లేవారు. అక్కడ ఓ అరగంట ఎక్సర్‌సైజ్ చేయించేవారు. ఆ తరువాత గంటపాటు ఈత నేర్పించేవారు. మొదటిసారి నీళ్లల్లోకి అడుగుపెట్టినప్పుడు ఎంత సంతోషమేసిందో! అక్కడ నాలాంటి పిల్లలు చాలామంది ఉన్నారు. నాకంటే పెద్దవాళ్లు కూడా వచ్చారు. మా కోచ్‌లు బాగా నేర్పించారు. ఈ సెలవులు ఇలా చాలా జాలీగా గడిచాయి ఫ్రెండ్స్. మరి మీకు.. మీ అనుభవాలు కూడా చిన్నారి పేజీకి రాసి పంపండి.



**- ఎం.అభినవ్,**
3వ తరగతి,
అరవింద హైస్కూల్, కుంచనపల్లి.

## లెక్క తేల్చండి





పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటి నెంబర్లు గా గుర్తించి గణించాను. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

**జవాబు : 126**

## నేను గీసిన బొమ్మ







పి.ప్రణవి,
ఎర్రంపేట,
చింతూరు,
అల్లూరి
సీతారామరాజు
జిల్లా.

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

# ఫ్లోరెన్స్ నైటింగేల్ శుభావతి

**ఉద్యోగం జీవితంలో ఒక భాగం చాలామందికి. కొంతమంది మాత్రం ఉద్యోగమే జీవితంలా భావిస్తారు. అలాంటివారిలో ఒకరే వలివేటి శుభావతి. తాజాగా ఆమెకి ఆరోగ్య శాఖలో జాతీయస్థాయి అత్యున్నత పురస్కారమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు దక్కింది. రోగుల ఆరోగ్య సంరక్షణను అత్యంత బాధ్యతగా స్వీకరించిన ఆమె హెల్త్ సెక్రటరీ (ఎఎన్ఎం)గా తన కెరియర్‌ని ప్రారంభించారు. ఆరోగ్య సహాయకురాలిగా ఉంటూనే ఉన్నత చదువులు చదివి అంచెలంచెలుగా ఆ రంగంలో ఉన్నత స్థాయి వరకు ఎదిగారు. ఈ ఏడాది జనవరిలో కర్నూలు ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రంలో గెజిటెడ్ హోదా అయిన మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా (బోధకురాలిగా) పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 39 సంవత్సరాల తన ఉద్యోగ జీవితంలో ఆమె ఎన్నో మైలురాళ్లు అధిగమించారు. మరెన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు.**

గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగం జాగర్లమూడి శుభావతి స్వగ్రామం. ప్రస్తుతం ఆమె గుంటూరులో ఉంటున్నారు. డిగ్రీ చదువుతున్నప్పుడు అక్క భర్త, మేనమామ భాస్కరరావు సలహా మేరకు హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు శిక్షణ తీసుకున్నారు. ఆయన గైడెన్స్‌లో ఒక పక్క శిక్షణ, మరోపక్క చదువు రెండింటినీ సమర్థవంతంగా నిర్వహించిన ఆమె చదువు పూర్తవ్వడంతోనే 1986లో ఆరోగ్య కార్యకర్తగా ఆరోగ్యశాఖలో ప్రవేశించారు. మొదటిపోస్టు నాదెండ్ల పిహెచ్‌సి, చందవరం గ్రామంలో చేశారు.

గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు చేసే సేవలు వెల కట్టలేనివి. వాగులు, వంకలు దాటుతూ, వన్యమృగాలను తప్పించుకుంటూ రోగులకు వైద్య సేవలు అందిస్తారు. శుభావతి కూడా అలాగే పనిచేశారు. ఆ అనుభవాలను ఆమె ఇలా చెబుతున్నారు. 'ఎండా, వాన పట్టించుకోకుండా తెల్లవారుజాము కల్లా గ్రామం చేరుకునేదాన్ని. ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు కూడా అంతంత మాత్రం ఉండేవి. ఎంత దూరమైనా నడుచుకుంటూ వెళ్లేదాన్ని. మోకాళ్ల లోతు నీళ్లల్లో నడుచుకుంటూ వెళ్లి వ్యాక్సిన్ వేసిన అనుభవం ఉంది. ఎన్నో ప్రసవాలు చేశా. వాస్తవానికి ఈ బాధ్యతల్లోకి అనుకోకుండా వచ్చాను. కానీ ఆయా గ్రామస్తులు నన్ను ఎంతో ఆదరించారు. వారికి ఏమాత్రం పరిచయం లేని నాపట్ల ఎంతో ప్రేమ చూపించారు. ఈ సమయంలోనే వైద్యసేవలు వారికి ఎంత ముఖ్యమో నాకు అర్థమైంది. నా సేవలు మరింత మందికి చేరువ కావాలని అప్పుడే అనుకున్నాను' అంటున్న శుభావతి మొదటి పోస్టులో 13 ఏళ్లు పనిచేశారు. ఆ తరువాత ప్రమోషన్ మీద గుంటూరు జిల్లా నకిరేకల్‌లో 12 ఏళ్ల పాటు సేవలందించారు.

**హెల్త్ ఎడ్యుకేటర్‌గా..**

కెరియర్‌లో ఆమె ఎదిగిన తీరును ఇలా వివరించారు. 'ఆరోగ్య కార్యకర్తగా ఉంటూనే ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివాను. ఒకానొక సందర్భంలో సెలవు తీసుకుని మరీ చదువుకున్నాను. అలా హెల్త్ ఎడ్యుకేషన్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ చేశాను. ఎంఎ సోషియాలజీ, మాస్టర్ ఆఫ్ పాపులేషన్ సైన్స్ చదివాను. గుంటూరులో హెల్త్ ఎడ్యుకేటర్‌గా ప్రమోషన్ మీద వెళ్లాను. అక్కడ పనిచేస్తున్నప్పుడు హెచ్ఐవి/ ఎయిడ్స్ ఆ ప్రాంతంలో ప్రబలంగా ఉండేది. కలెక్టర్లు, అధికారులు ఢిల్లీ పంపించి నాకు ట్రైనింగ్ ఇప్పించారు. అక్కడి నుండి వచ్చాక ప్రభుత్వ విభాగాల్లో అనేకమందికి అవగాహన క్లాసులు బోధించాను. టీచర్లు, సిడిపిఓలకి, ఎంఆర్ఓ, డిఆర్‌డిఏ, పోలీస్, లాయర్, ఆర్ఎంపీ, పిఎంపీ.. ఇలా అందరికి ఐదేళ్ల పాటు అవగాహనా క్లాసులు తీసుకున్నాను. ఉత్తమ హెల్త్ ఎడ్యుకేటర్‌గా నిలబడ్డాను. నా సేవలను గుర్తించి అప్పటి ప్రభుత్వం నాకు అవార్డు కూడా ఇచ్చింది.

**ఎక్స్‌టెన్షన్ అధికారిగా..**

12 ఏళ్ల తరువాత 2011లో గుంటూరు నుండి నెల్లూరుకి



డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ అండ్ మీడియా ఆఫీసర్‌గా ప్రమోషన్ మీద బదిలీ అయ్యాను. ఇది నా ఫస్ట్ గెజిటెడ్ పోస్టు. ఒక ఆరోగ్య కార్యకర్తగా ప్రయాణం మొదలుపెట్టిన నేను ఈ స్థాయికి వచ్చానంటే ఎంతోమంది అధికారులు ఇచ్చిన ప్రోత్సాహం ఉంది' అని ఆమె తన ఉద్యోగ విశేషాలు చెప్పారు. నెల్లూరుకి గెజిటెడ్ పోస్టులో వెళ్లిన శుభావతి సేవలు మరింత విస్తృతస్థాయికి వెళ్లాయి. అక్కడ జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణపై స్కూలు పిల్లలకు కూడా ఆమె బోధించారు. సెన్సిటివ్ సబ్జెక్ట్ గైనిక్‌ని అందరికీ అర్థమయ్యేలా చెప్పడం శుభావతి నైపుణ్యం.

**నా పాటకి తమన్ మ్యూజిక్ అందించారు..**

పాఠాలు బోధించడమే కాదు, పలు ప్రభుత్వ పథకాలని ప్రజలకు చేరువ చేసేలా పాటల రూపంలో కూడా ఆమె మలిచారు. ఆ అనుభవాలని ఇలా చెప్పారు. 'నెల్లూరు జిల్లాలో నేను అందించిన సేవలు ఎంతో సంతృప్తికరంగా సాగాయి. అక్కడ గర్భిణీలకి ప్రభుత్వం అందించే సేవలు, భ్రూణ హత్యలపై అవగాహన కల్పించడం, రక్తదానం, వ్యాక్సిన్ ఆవశ్యకత, రుతుక్రమ పరిశుభ్రత, రక్తహీనత వంటి అనేక ఆరోగ్య సేవలకు సంబంధించి ప్రజలకు చేరువయ్యేలా పాటలు రాసి అన్ని కేంద్రాలకు పంపాను. అవి చూసి అధికారులు నన్ను ఎంతో మెచ్చుకున్నారు. అక్కడ ఉండగానే 2014లో ఎలక్షన్లు జరిగాయి. ఐఎఎస్ అధికారులు శ్రీకాంత్, రేఖారాణి, ఇంతియాజ్ గార్లు నాతో ఓటర్ అవగాహనపై కూడా పాట రాయించారు. ఆ పాట కంపోజింగ్ కోసం చెన్నైలో తమన్‌ని కలిసేందుకు పంపారు. ఆ పాటని ప్రముఖ గాయకులు గీతామాధురి, మాళవిక, శ్రీకృష్ణ, దీపు, కృష్ణచైతన్యతో పాడించారు' అంటున్న శుభావతి ఆకాశవాణిలో కూడా పలు కార్యక్రమాలకు గీతాలు రాసి, ఆలపించారు. ఆమె రాసిన ఓ పాటని అర్బన్ సెంటర్స్ ఎఎన్ఎం బుక్స్ మీద ఫ్రంట్ పేజీలో ప్రార్థనా గీతంగా అమలు చేయమని అప్పటి రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ అధికారి కాటమనేని భాస్కర్ ఉత్తర్వు ఇచ్చారు.

ఆరోగ్యసేవల్లో ఉన్నత అధికారిణిగా ఉన్న శుభావతికి సాహిత్యంపై ఇంత పట్టు ఎలా వచ్చిందో ఆమె ఇలా చెప్పారు. "మా అమ్మానాన్నా సీతారావమ్మ, సుబ్రహ్మణ్యం సంగీతపోషకులు. అమ్మ ఇంట్లోనే కీర్తనలు పాడేది. ఘంటశాల సినిమాల్లో పాటలు పాడే సమయంలో నాన్నని సినిమాల్లో పాటలు పాడమని ఎంతోమంది డైరెక్టర్లు, నిర్మాతలు ఇంటికొచ్చేవారంట. నాన్న చనిపోయే వరకు ఆ విషయం చెప్పేవారు. అన్నయ్య, అక్కకి కూడా సంగీతం బాగానే అబ్బింది. ఈలపాటి రఘురామయ్య గారు అన్నయ్యతో పాట పాడించుకుని ఎంతో మెచ్చుకునేవారు. నేనొక్కదాన్నే ఆరోగ్య రంగంవైపు వచ్చాను' అని తన కుటుంబ విషయాలు చెప్పారు.

కోవిడ్ సమయానికి శుభావతి ప్రమోషన్ మీద శ్రీకాకుళం వెళ్లారు. అక్కడ కలెక్టర్లు నివాస్, ధనుంజయ్ తనని ఎంతగానో ప్రోత్సహించారని ఆమె చెప్పారు. శ్రీకాకుళం అనుభవాలను ఆమె ఇలా పంచుకున్నారు. 'అక్కడ నేను చేసిన సేవలకు గాను 'ఆంధ్రరత్న' బిరుదును గవర్నమెంట్ గుర్తింపు పొందిన ఎపి కల్చరల్ ఎవేర్‌నెస్ సంస్థ బహుకరించింది. అంతకుముందు ఈ సంస్థ ఎపి స్టేట్స్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డును ఇచ్చింది.

**మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా..**

కలెక్టర్లు, డిఎంహెచ్ఓ వంటి ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారులకు మాత్రమే దక్కే అవకాశం శుభావతి తన కెరియర్‌లో దక్కించుకున్నారు. గుంటూరు నుండి ఫస్ట్ గెజిటెడ్‌గా నెల్లూరు, ఆ తరువాత సెకండ్ గెజిటెడ్‌గా శ్రీకాకుళం, థర్డ్ గెజిటెడ్‌గా కర్నూలుకు ప్రమోషన్ల మీదే శుభావతి బదిలీ అయ్యారు. ఈ స్థాయి పోస్టు వచ్చాక కూడా ఆమె ఆఫీసు గదికే పరిమితం అవ్వలేదు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని ప్రజల్లోకి వెళ్లారు. 'నాకు టీచింగ్ అంటే చాలా ఇష్టం. నేను ఒక పదిమందికి అవగాహన కల్పిస్తే వారు మరో వందమందికి దాన్ని చేరవేరుస్తారు. అదే నా లక్ష్యం. ఆడపిల్లలు, మగపిల్లలకు కౌమారదశ చాలా కీలకమైంది. ఆ వయసు పిల్లలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను. రిటైర్ అయినా కూడా ప్రజలకు ఇంకా ఆరోగ్య సేవలు అందించాలని నా మనసు కోరుకుంటోంది" అంటున్న శుభావతి లాంటి అధికారులు చాలా అరుదుగా కనిపిస్తారు.

**- జ్యోతిర్మయి**

---

## జులైలో ఆఫ్రికా అడవులకు 'మహారాజ్'



మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకుడు రాజమౌళి తీస్తున్న చిత్రం పనులు స్పీడ్ అందుకున్నాయి. కొద్దిరోజుల క్రితం ఒడిసాలో చిత్రీకరణ జరుపుకున్న ఈ భారీ ప్రాజెక్ట్ అక్కడ కొన్ని కీలక సన్నివేశాలతోపాటు, యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్ర యూనిట్ ఇప్పుడు ఆఫ్రికాలోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లనుంది. కథ రీత్యా ఈ సినిమాలోని అత్యంత కీలకమైన చిత్రీకరణలు ఇక్కడ షూట్ చేయనున్నారు. జులైలో కెన్యాకు చిత్ర యూనిట్ పయనం కానుంది. మసాయి-పిగ్మీస్ తెగలతో ఇప్పటికే మహేశ్‌బాబు కొద్దిరోజులు గడిపారు. ఆ ప్రాంతపు యుద్ధ విద్యలపై బేసిక్ స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లుగా సమాచారం. దాదాపు 30రోజుల పాటు జరగనున్న షూటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది చిత్ర యూనిట్. అక్కడి ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్‌లో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లుగా తెలుస్తోంది. కెన్యాలో జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. మహేశ్‌తోపాటుగా పృథ్వీరాజ్ సుకుమార్‌తో పాటు మరికొందరు అక్కడ షఉటింగ్‌లో పాల్గొననున్నారు. ఇక ఈ సినిమాకు 'మహారాజా', 'మహారాజ్' అనే టైటిల్స్‌ను అనుకుంటున్నారని ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

## డైరెక్షన్ చేస్తున్నా..




టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ త్వరలో దర్శకుడిగా మెగా ఫోన్ పట్టనున్నారు. డైరెక్షన్ అంటే ప్యాషన్ అని ఆయన గతంలో చాలాసార్లు చెప్పారు. తాజాగా తాను దర్శకత్వం వహించనున్న తొలి ప్రాజెక్ట్‌కు సంబంధించి నటీమణుల ఎంపిక ప్రారంభించారు. ఎక్స్ వేదికగా శనివారం ఉదయం ఆయన ఓ పోస్ట్ పెట్టారు. 'దర్శకుడిగా నా తొలి ప్రాజెక్ట్.. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే దయచేసి మీ షోరీల్స్, ఫొటోలను నా మెయిల్‌కు పంపించగలరు' అని పేర్కొన్నారు. లఘు చిత్రాలతో నటుడిగా మారిన రాహుల్ రామకృష్ణ.. 'జయమ్ము నిశ్చయమ్మురా'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రానికి డైలాగ్ రైటర్‌గానూ వర్క్ చేశారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి' ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. తదుపరి 'భరత్ అనే నేను', 'చి.ల.సౌ.', 'గీత గోవిందం', 'కల్కి', 'బ్రోచేవారెవరురా', 'అల.. వైకుంఠపురములో..', 'జాతిరత్నాలు' చిత్రాల్లో నటించి అలరించారు.

## సినీ, టీవీ నటుడు గోపాలరావు మృతి



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ సినీ, టీవీ నటుడు అల్లం గోపాలరావు (75) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన శనివారం ఉదయం 8 గంటలకు తన నివాసంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. గోపాలరావుకు భార్య విమల, ఇద్దరు కుమారులు అనిల్, సునీల్ ఉన్నారు. పెద్ద కుమారుడు అనిల్ సీరియల్స్ చేస్తూ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పలువురు సినీ, టీవీ ప్రముఖులు గోపాలరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ మేనేజ్మెంట్ కమిటీ గోపాలరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. గోపాలరావు 'మేఘ సందేశం', 'నిండు నూరేళ్ల సావాసం' వంటి సీరియల్స్‌లో నటించారు. కొన్నాళ్లపాటు సినిమాల్లో కీలకపాత్రలు పోషించిన గోపాలరావు గత పదేళ్లుగా ఎక్కువగా సీరియల్స్ చేస్తున్నారు.

## మణిరత్నంకు పైడి జయరాజ్ అవార్డు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సిరిసిల్లకు చెందిన పైడి జైరాజ్ పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును ఈ ఏడాది బాలీవుడ్ దర్శకుడు మణిరత్నం అందుకున్నారు. భారతీయ సినిమా మాటలు నేర్వకముందే అంటే మూకీ యుగంలోనే పైడి జైరాజ్ సినీ ప్రయాణం మొదలైంది. భారత తొలి మాటల చిత్రం అలంఆరా (1931) సినిమాతో తనదైన ముద్ర వేసిన పైడి జైరాజ్ హిందీలో కూడా గుర్తింపు పొందారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు మణిరత్నంకు ఈ అవార్డు అందజేసింది. కరీంనగర్ ఫిల్మీ సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర పైడి జైరాజ్‌పై నిర్మించిన డాక్యుమెంటరీ గాను 2024 బెస్ట్ ఫిలిం క్రిటిక్‌గా రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డు ప్రకటించింది. అవార్డు అందుకుంటున్న మణిరత్నం, రవిచంద్రలను సందర్భంగా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ జీవీ శ్యాంప్రసాద్ లాల్, కరీంనగర్ ఫిలిం సొసైటీ బాధ్యులు లక్ష్మీ గౌతమ్, మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, కోల రామచంద్రారెడ్డి, వారాల మహేశ్ తదితరులు అభినందించారు.

## తెరపైకి కనగరాజ్?



'ఖైదీ' 'విక్రమ్', 'లియో' వంటి వరుస యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ప్రస్తుతం సమర్పకుడిగా పలు చిత్రాలను రూపొందిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయనకు సంబంధించిన ఓ వార్త వైరల్ అవుతోంది. ఆయన త్వరలోనే నటుడిగా వెండితెరపై మెరవనున్నట్లు తెలుస్తోంది. 'కెప్టెన్ మిల్లర్' చిత్రాన్ని తెరకెక్కించిన అరుణ్ మతేశ్వరన్ దర్శకత్వంలో లోకేశ్ సినిమా చేయనున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయని టాక్. మరోవైపు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథ ఉండనుందని చెన్నై పత్రికలు పేర్కొంటున్నాయి. ఈ సినిమా కోసం లోకేశ్ ఎంతగానో సన్నద్ధమవుతున్నారని మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి. తన తదుపరి చిత్రాల షూటింగ్స్, ఇతర పనులు చూసుకుంటూనే ఆయన ఈ సినిమాలో నటించనున్నారని తెలుస్తోంది.

# చోకర్స్ కాదు ఛాంపియన్స్

- 27ఏళ్ల నిరీక్షణకు తెర
- డబ్ల్యుటిసి గద దక్షిణాఫ్రికా కైవసం
- ఫైనల్లో ఆస్ట్రేలియాపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

**ఐసిసి టోర్నీల్లో లీగ్ దశలో చెలరేగి ఆడడం.. నాకౌట్ మ్యాచుల్లో చతికిలపడడం దక్షిణాఫ్రికా జట్టుకు పరిపాటి. కానీ ఈసారి ఆ ఫోబియోను జయించి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యాన్ని మరో ఐదు వికెట్లు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించింది. దీంతో మార్క్ బౌచర్, షాన్ పొలాక్, జాక్వెస్ కలిస్, డివిలియర్స్, గ్రేమ్ స్మిత్ వంటి దిగ్గజాలు అందించలేని ఐసిసి ట్రోఫీని తెంబ బవుమా బృందం సాధించింది. అలాగే 1998 తర్వాత 27ఏళ్ల తర్వాత మరో ఐసిసి ట్రోఫీని కైవసం చేసుకుంది. టైటిల్ నెగ్గిన దక్షిణాఫ్రికాకు రూ.30.80కోట్లు, రన్నరప్ ఆస్ట్రేలియాకు రూ.17.94కోట్లు ప్రైజ్ మనీ దక్కింది.**




**లండన్:** ఐసిసి టోర్నీలో ఎంత బాగా ఆడినా సరే తీరా ఫైనల్‌కు వచ్చేసరికి ఒత్తిడి ఆవహించేది. అలా మూడు పర్యాయాలు ఆఖరి మెట్టుపై తడబడి ఛాంపియన్ ట్యాగ్‌ను చేజార్చుకుంది దక్షిణాఫ్రికా. గత ఏడాది పురుషుల టి20 వరల్డ్ కప్ ఫైనల్ చేరిన మర్క్రమ్ సారథ్యంలోని ప్రొటీస్ జట్టు బార్బడోస్ గడ్డపై టీమిండియా చేతిలో 7 పరుగుల తేడాతో ఓడిపోయింది. కానీ ఈసారి లార్డ్స్‌లో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపించి విజేతగా నిలిచింది. దాంతో.. ఇకపై తాము 'చోకర్స్ కాదు ఛాంపియన్స్' అని సగర్వంగా ప్రపంచానికి చాటారు సఫారీ ఆటగాళ్లు.

ఆస్ట్రేలియా నిర్దేశించిన 282పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 212 పరుగులతో నాల్గోరోజు ఆటను కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టు తొలుత వికెట్లను కాపాడుకునేందుకు ప్రయత్నించింది. ప్రారంభంలోనే బవుమా(66), ఆ తర్వాత స్టబ్(8) వికెట్లను కోల్పోయినా.. ఎడెన్ మర్క్రమ్‌కు జట్టును విజయ తీరాలకు చేర్చాడు. వెర్రెయనే(21నాటౌట్) తో కలిసి మార్క్రమ్(136) జట్టును గెలుపు ముంగిట నిలిపాడు. విజయం ఖాయమయ్యాక మార్క్రమ్.. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. స్టార్క్ బౌలింగ్‌లో కైలీ వెర్రెయనే విన్నింగ్ షాట్ కొట్టగానే సఫారీ డగౌట్‌లో సంబరాలు మొదలయ్యాయి. దీంతో ఐసిసి టైటిల్ ముద్దాడాలన్న దక్షిణాఫ్రికా జట్టు 27ఏళ్ల నిరీక్షణకు బవుమా బృందం తెరదించింది. ఐసిసి ఛైర్మన్ జై షా చేతుల మీదుగా బవుమా టెస్టు గదను అందుకున్నాడు. సహచరుల జయ జయ ధ్వానాల మధ్య అతడు గదను రెండు చేతులతో పైకి ఎత్తి 'మేమే ఛాంపియన్లం' అని ప్రపంచానికి చాటాడు.

**రికార్డు పుటల్లో మర్క్రమ్**



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మార్క్రమ్

దక్షిణాఫ్రికా తరఫున ఐసిసి ఈవెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌లో శతకం బాదిన తొలి బ్యాటర్‌గా మార్క్రమ్ రికార్డు పుటల్లో కెక్కాడు. ఆసీస్ నిర్దేశించిన 282 పరుగుల విజయ లక్ష్యంతో నాల్గోరోజు బరిలోకి దిగిన సఫారీ జట్టును తన కీలక ఇన్నింగ్స్‌తో మార్క్రమ్ మెరుగైన స్థితిలో నిలిపాడు. మూడోవికెట్‌కు మార్క్రమ్ కెప్టెన్ బవుమాతో కలిసి 147 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. దక్షిణాఫ్రికా జట్టు స్కోర్‌కు ఒక్కో పరుగు జత చేస్తూనే.. కొండంత లక్ష్యాన్ని కరిగించే ప్రయత్నం చేశారు. దీంతో మూడో డబ్ల్యుటిసి టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై గెలిచి 27 ఏళ్లుగా తమకు అందకుండా ఊరిస్తున్న ఐసిసి ట్రోఫీని అందించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మార్క్రమ్‌కు దక్కింది.

**స్కోర్‌బోర్డు...**

**ఆస్ట్రేలియా : 212, 207**

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138**

**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్రమ్ (సి)హెడ్ (బి)హేజిల్‌వుడ్ 136, రికెల్టన్ (సి)క్యారీ (బి)స్టార్క్ 6, ముల్డర్ (సి)లబూషేన్ (బి)స్టార్క్ 27, బవుమా (సి)క్యారీ (బి)కమిన్స్ 66, స్టబ్స్ (బి)స్టార్క్ 8, బెడింగ్హామ్ (నాటౌట్) 21, వెర్రెయానే (నాటౌట్) 4, అదనం 14. (83.4ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 282పరుగులు.

**వికెట్ల పతనం:** 1/9, 2/70, 3/217, 4/241, 5/276 **బౌలింగ్:** స్టార్క్ 14.4-1-66-3, హేజిల్‌వుడ్ 19-2-58-1, కమిన్స్ 17-0-59-1, లియాన్ 26-4-66-0, వెబ్‌స్టెర్ 5-0-13-0, హెడ్ 2-0-8-0.

## జిమ్నాస్టిక్స్‌లో ప్రణతికి కాంస్యం

- ఆసియా ఆర్టిస్టిక్ ఛాంపియన్‌షిప్స్



**సియోల్:** దక్షిణ కొరియా వేదికగా జరుగుతున్న ఆసియా ఆర్టిస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ కాంస్య పతకంతో మెరిసింది. శనివారం జరిగిన జిమ్నాస్టిక్స్ వాల్ట్ విభాగంలో 30ఏళ్ల ప్రణతి 13.466పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలోనే భారత్‌కే చెందిన సమంత నాల్గోస్థానానికే పరిమితమైంది. ప్రణతికి ఇది మూడో కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్ పతకం. దీంతో దీపా కర్మాకర్ 2 పతకాల రికార్డును ప్రణతి అధిగమించింది. ఇంతకుముందు ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో ప్రణతి నాయక్ 2019(ఉలాన్‌బాతర్), 2022(దోహా)లలో కాంస్య సాధించింది. అలాగే ఈ ఏడాది మార్చిలో టర్కీలోని అంటాల్యలో జరిగిన ఎఫ్ఐజి ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్ అపారటస్ ప్రపంచకప్ వాల్ట్ విభాగంలో ప్రణతి మరో కాంస్య పతకాని చేజిక్కించుకుంది.

## ఆర్యా-అర్జున్‌కు స్వర్ణం

- ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్




**మ్యూనిచ్(జర్మనీ):** ఐఎస్-ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో భారత్‌కు మరో స్వర్ణ పతకం దక్కింది. శనివారం జరిగిన మిక్స్‌డ్ టీమిం విభాగంలో ఆర్యా బోర్సే-అర్జున్ బబుత జంట బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో భారత జంట 17-7పాయింట్ల తేడాతో చైనాకు చెందిన జీఫీ వాంగ్-లిహావో షెంగ్ జంటను చిత్తుచేశారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 635.2, చైనా జంట 535.9 పాయింట్లతో ప్రపంచ రికార్డు స్కోర్‌తో ఫైనల్‌కు చేరారు. వ్యక్తిగత విభాగంలో అర్యా బోర్జే 317.5, బవుత 317.7పాయింట్లు సాధించారు. ఈ ఏడాది పెరూ వేదికగా జరిగిన ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆర్యా-రుద్రాక్ష జంట రజత పతకం సాధించింది. భారత్‌కే చెందిన ఇలవేనియల్-అంకుశ్ జంట 631.8పాయింట్లతో ఆరో స్థానానికి పరిమితమైంది. చైనాకు రజతం, నార్వేకు కాంస్య పతకాలు దక్కాయి.


జవాను తల్లి జ్యోతిబాయికి చెక్కును అందజేస్తున్న జనసేన ఎమ్మెల్యేలు

## మురళీనాయక్ కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - గోరంట్ల టౌన్**

ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన జవాన్ మురళి నాయక్ కుటుంబానికి జనసేన పార్టీ తరుపున రూ.25 లక్షల చెక్కును ఆ పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. జవాను కుటుంబానికి జనసేన తరుపున సాయం చేస్తామని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇది వరకే ప్రకటించిన మేరకు శనివారం జనసేన తిరుపతి ఎమ్మెల్యే అరుణ శ్రీనివాసులు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలు శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు వెళ్లారు. జవాన్ తల్లి జ్యోతిబాయిని పరామర్శించారు. అనంతరం రూ.25 లక్షల చెక్కును అందజేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనిక కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని జనసేన ఎమ్మెల్యేలు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో అహుడా చైర్మన్ టిసి.వరుణ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, నాయకులు లక్ష్మీపతి, గవ్వల శ్రీనివాసులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలు సంతోషంగా ఉండటం జగన్‌కు ఇష్టంలేదు: బ్రహ్మం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వైఎస్ జగన్, అతని బృందానికి రాష్ట్రం అభివృద్ధి చెందడం, పేదలు సంతోషంగా ఉండటం నచ్చదని, అందుకే తల్లికి వందనం పథకంపై దుష్ప్రచారం చేస్తున్నారని టిడిపి నిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం అన్నారు. జగన్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఇవ్వాలంటే అప్పు కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని, కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దిందని అన్నారు.

## దుబాయ్‌లో 67 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం..

**అబుదాబి:** దుబాయ్‌లో 'టైగర్ టవర్ 'గా పేరు పొందిన 67 అంతస్తుల 'మెరీనా పినాకిల్' భవనంలో శుక్రవారం అర్ధరాత్రి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. సహాయక బృందాలు దాదాపు 6 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్టు స్థానిక మీడియా తెలిపింది. ఈ క్రమంలోనే భవనంలోని 764 ఫ్లాట్‌లలోని 3,820 మంది నివాసితులను సురక్షితంగా తరలించారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

- వృద్ధురాలి ఇంటికి బిగించిన మీటరును తొలగించిన అదాని సిబ్బంది

**ప్రజాశక్తి - విజయవాడ**

నివాస గృహాల్లో మోసపూరితంగా అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడానికి ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలను స్థానిక ప్రజలతో కలిసి సిపిఎం శ్రేణులు అడ్డుకుంటున్నాయి. ప్రతి ఇంట్లో అదాని దోపిడీకి బీజాలు వేస్తున్న ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ నిలువరిస్తున్నాయి. దీనిలో భాగంగా విజయవాడ 64 డివిజన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ (కండ్రిక కాలనీ)లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్‌ను సిపిఎం నేతలు తొలగించారు. ఈ కాలనీలో 75 ఏళ్ల వృద్ధురాలు రాజ్యలక్ష్మి ప్రభుత్వం కేటాయించిన ఓ చిన్న ఇంట్లో ఉంటున్నారు. స్లాబ్ దెబ్బతిని కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఆ ఇంట్లోనే బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ మీటర్ పనిచేయడం లేదనే సాకుతో అదాని కంపెనీ సిబ్బంది వచ్చి పాత మీటర్ తొలగించి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌ను బిగించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక సిపిఎం కార్యకర్తలు... వృద్ధురాలు రాజ్యలక్ష్మికి స్మార్ట్ మీటర్‌తో కలిగే ప్రమాదాన్నీ, పడే భారాన్నీ వివరించారు. దీంతో వృద్ధురాలితోపాటు స్థానికులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన నిర్వహించారు. అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ప్రజాందోళన ఫలితంగా అదానీ సిబ్బంది వచ్చి స్మార్ట్ మీటర్‌ను తొలగించారు. దాని స్థానంలో మళ్లీ పాత డిజిటల్ మీటర్‌నే బిగించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పలువురు సిపిఎం నేతలు శనివారం కండ్రిక కాలనీలో పర్యటించి రాజ్యలక్ష్మి గహాన్ని సందర్శించారు. స్మార్ట్ మీటర్‌కు వ్యతిరేకంగా పోరాడిన వృద్ధురాలు రాజ్యలక్ష్మిని, స్థానికులను అభినందించారు. కాలనీలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి స్మార్ట్ మీటర్లపై ప్రజలను చైతన్యపరిచారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

సమావేశాలు నిర్వహించారు. ఈనేపథ్యంలో ఉమ్మడిగా స్మార్ట్ మీటర్లను అడ్డుకోవటానికి స్థానికులు నిర్ణయించుకున్నారు. ఈ పాదయాత్రలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, నాయకులు ఝాన్సీ, వెంకటరెడ్డి, పీర్ సాహెబ్, సావిత్రి, పిచ్చమ్మ, సుందరరామరాజు తదితరులు పాల్గొన్నారు.


విజయవాడ కండ్రిక ప్రాంత మహిళలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

## 85శాతం అమలు చేశాం

- సూపర్ సిక్స్‌పై మంత్రి పార్థసారధి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను 85శాతం మేర పూర్తి చేశామని, ఈనెలలోనే అన్నదాత సుఖీభవ కూడా అందిస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. విజయవాడ బందరు రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొత్తం మీద అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కలుపుకుని ఒక్కో కుటుంబానికి ఇప్పటి వరకు సుమారు రూ.రూ.1.04లక్షలు అందించినట్లు మంత్రి తెలిపారు.

విజన్ 2047 లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం 15శాతం అభివృద్ధి లక్ష్యంతో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి కేవలం ఒక్కరికి మాత్రమే ఇచ్చిందని తమ ప్రభుత్వం అలా కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు జమ చేస్తున్నట్లు చెప్పారు. శాసనసభకు రాని పార్టీ ఏదైనా దేశంలో ఉందంటే అది వైసిపి మాత్రమేనన్నారు. తల్లికి వందనం డబ్బులు రెండు వేలు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని వైసిపి అంటోందని, రెండు వేలు తన అకౌంట్‌లోకి వెళ్లినట్లు నిరూపించాలని నారా లోకేష్ సవాల్ విసిరారని, అందుకు సిద్ధమా అని మంత్రి ప్రశ్నించారు. ఏడాదిలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కింద రూ.34వేలకోట్లు అందించామన్నారు. గతంలో కంటే సంక్షేమ రంగానికి ఎక్కువగా నిధులు కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులతో రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లారన్నారు. అనంతరం తల్లికి వందనం లబ్ధిదారులైన తల్లులు పిల్లలతో కలిసి మంత్రి పార్థసారథి కేక్ కట్ చేశారు.

## చిత్తశుద్ధితో సూపర్-6 హామీల అమలు

- 24.61 లక్షల మందికి అదనంగా 'తల్లికి వందనం' : మంత్రి మనోహర్

**ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా):**

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తల్లికి వందనం పథకం అమలుపై గుంటూరు జిల్లా తెనాలిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ పథకం అమలు సాధ్యం కాదని ప్రజలను తప్పుదారి పట్టించేందుకు వైసిపి విమర్శలు చేసిందని, అయితే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ 'తల్లికి వందనం' పథకం అమలుకు శ్రీకారం చుట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 65.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,191 కోట్లను తల్లుల ఖాతాలకు జమ చేశామని, దీనిలో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ. 2 వేలు, తల్లుల ఖాతాలకు రూ.13 వేల చొప్పున జమ చేశారని చెప్పారు. గత ప్రభుత్వంతో పోల్చితే 24.61 లక్షల మంది విద్యార్థులకు అదనంగా ప్రయోజనం చేకూరిందన్నారు.

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, ఖజానాపై రూ.3245 కోట్ల భారం పడుతున్నా హామీ నెరవేర్చేందుకు ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. తెనాలి నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా 22,383 మంది విద్యార్థులకు రూ.32,07,45,000 ప్రయోజనం చేకూరిందన్నారు. విజన్-2047 లక్ష్యాలను అధిగమించాలంటే అక్షరాస్యతలో రాష్ట్రం ముందంజలో ఉండాలని, ప్రస్తుతం రాష్ట్రంలో 72 శాతమే అక్షరాస్యత ఉందని చెప్పారు. రాజధాని అమరావతితో పాటు తెనాలి ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

## అమెరికాలో చట్టసభ సభ్యులే లక్ష్యంగా కాల్పులు..

- మిన్నెసోటా ప్రతినిధి, ఆమె భర్త మృతి

**వాషింగ్టన్:** అమెరికాలో చట్టసభ సభ్యులే లక్ష్యంగా పోలీసు అధికారి వేషంలో వచ్చిన ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో మిన్నెసోటా స్టేట్ రిప్రజెంటేటివ్ మెలిస్సా హర్ట్‌మన్, ఆమె భర్త మార్క్ ప్రాణాలు కోల్పోయారు. స్టేట్ సెనెటర్ జాన్ హఫ్‌మన్, ఆయన సతీమణిపైనా కాల్పులు జరపగా.. వారికి తీవ్ర గాయాలయ్యాయి. చాంప్లిన్, బ్రూక్లిన్ పార్క్‌లోని వారి వారి నివాసాల వద్ద ఈ కాల్పులు జరిగినట్టు తెలుస్తోంది. వీటిని రాజకీయ హత్యలుగా అనుమానిస్తున్నామని మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ వెల్లడించారు. పోలీసు అధికారి వేషంలో వచ్చిన వ్యక్తి ఈ దాడులకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. చట్టసభ సభ్యులపై కాల్పులను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఇవి భయంకరమైన కాల్పులుగా పేర్కొన్న ఆయన.. ఈ ఘటనపై ఎఫ్‌బిఐ దర్యాప్తు చేస్తుందన్నారు. డెమొక్రటిక్ నేత మెలిస్సా హర్ట్‌మన్ గతంలో స్పీకర్‌గా పనిచేశారు. తొలిసారి ఆమె 2004లో చట్టసభలో అడుగుపెట్టారు. బ్రూక్లిన్ పార్క్‌లో నివసిస్తున్న హర్ట్‌మన్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## వేతనాల పెంపు కంటితుడుపు చర్య

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

**ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)**

చేనేత కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్లు రాష్ట్ర చేనేత మంత్రి సవిత ప్రకటించడం కంటితుడుపు చర్య మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసిపి ప్రభుత్వం కానీ ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం కానీ చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేట్ కింద రూ.156 కోట్లు, చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన త్రిఫ్ట్ పండు కింద రూ.ఐదు కోట్లు విడుదల చేయలేదని తెలిపారు. దీనివల్ల చేనేత కార్మికులకు సహకార సంఘాలు పని చూపలేకపోతున్నామని పేర్కొన్నారు. సహకార సంఘాలకు ఆప్కో ఆరు శాతం లాభమే ఇస్తోందని, పైగా కొనుగోలు చేసిన వస్త్రాల బకాయిలను ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో బ్యాంకుల వడ్డీలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, కాలపరిమితి ముగియడంతో సహకార సంఘాలకు బ్యాంకు అప్పులు పుట్టక చేనేత సహకార వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని తెలిపారు. త్రిఫ్ట్ ఫండుపై మంత్రికి తాము విన్నవించగా ఐదు రోజుల్లో రూ. ఐదు కోట్లు విడుదల చేస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా విడుదల చేయలేదని, సహకార సంఘాల అధ్యక్షులతో విజయవాడలో జరిపిన రాష్ట్రస్థాయి సమావేశంలో రూ.156 కోట్ల రిబేటు, సబ్సిడీల గురించే ప్రస్తావించలేదని తెలిపారు. ఇవన్నీ చేయకుండా వేతనాల పెంపు ప్రకటన కంటితుడుపు చర్య కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సహకార సంఘాలకు ఉన్న క్యాష్ క్రెడిట్ మొత్తం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## తల్లికి వందనం'తో ఆనందోత్సాహం : మంత్రి సవిత

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తల్లికి వందనం పథకం అమలుతో పేద విద్యార్థుల ఇళ్లల్లో ఆనందోత్సాహం వెల్లివిరుస్తుందని బిసి, సంక్షేమ శాఖమంత్రి ఎస్ సవిత అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పార్టీ నాయకులు ఓర్వలేక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్‌పై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తన మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే జగన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం కంటే అదనంగా తల్లికి వందనం పథకానికి రూ.4551కోట్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అభివృద్ధికి టిడిపి ప్రభుత్వాలే వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని చెప్పారు. పాఠశాలలు పున:ప్రారంభం చేసిన రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న మెగా డిఎస్సిని అడ్డుకోవడానికి జగన్ కుట్రపన్నారని విమర్శించారు.

**పరామర్శ పేరుతో అలజడి సృష్టించిన జగన్ : నక్కా ఆనంద్‌బాబు**

పొగాకు రైతుల పరామర్శ పేరుతో పొదిలిలో వైఎస్ జగన్ అలజడి సృష్టించారని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన పొగాకు రైతుల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కారానికి నిరంతరం పనిచేస్తుంటే జగన్ నానా యాగీ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో బర్లీ పొగాకు కొనుగోళ్లు కూడా పెరిగాయని, క్వింటాకు రూ.12వేలు కొనుగోలు ధర ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతుల పరామర్శకు 40వేల మంది రావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మహిళలు, పోలీసులపై అసాంఘిక శక్తులతో జగన్ రాళ్లదాడి చేయించారని విమర్శించారు. పోలీసులు 24 మందిని అరెస్టు చేస్తే వారిలో తొమ్మిది మందిపై కేసులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుందని, రాజారెడ్డిది కాదన్నారు.

**రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జగన్‌కు నమ్మకం లేదు : పిల్లి మాణిక్యరావు**


వ్యవస్థలు, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జగన్‌కు నమ్మకం లేదని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. జగన్‌కు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం లేదని, ఉందనుకుంటే వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు షరతులతో కూడిన బెయిల్ ఇస్తే నిర్దోషిగా విడుదలైనట్లుగా పండుగ చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి




కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083


## కరెంట్ అఫైర్స్



**గవర్నర్ వ్యవస్థ- 'సుప్రీం' తీర్పు**

దేశంలో ఇటీవల కాలంలో గవర్నర్ వ్యవస్థపై అనేక వివాదాలు చెలరేగాయి. అనేక రాష్ట్రాల్లో గవర్నర్ కార్యాలయం, ఆ రాష్ట్రంలో ఎన్నికైన ప్రభుత్వం మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న పరిస్థితులను చూశాం. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, జార్ఖండ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. గవర్నర్లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చెలరేగిన రాజకీయ వివాదాలు రాజ్యాంగంలోని సమాఖ్య నిర్మాణం పనితీరుకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో శాసనసభలు ఒకటికి రెండు సార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవి తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తోపాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తే అందుకు కారణాలనూ జత చేయాలని తెలిపింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులకు ఆమోదం తెలియచేయకుండా ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడాన్ని తప్పు పడుతూ 2025 ఏప్రిల్ 8న దేశ చరిత్రలో మొట్టమొదటిసారి రాష్ట్రపతి అధికారాలకు సంబంధించి సంచలన తీర్పును జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం వెలువరించింది.

**సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యమైన అంశాలు:**

- గవర్నర్లు నివేదించిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రపతిని దేశ అత్యున్నత న్యాయస్థానం. ఆదేశించింది. రాష్ట్రపతికి సర్వోన్నత న్యాయస్థానం ఇలా గడువు నిర్దేశించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి.
- మూడు నెలలు దాటినా సరైన కారణాలు చూపకుండా బిల్లులపై రాష్ట్రపతి ఏ నిర్ణయమూ తీసుకోని పక్షంలో సంబంధిత రాష్ట్రాలు న్యాయస్థానాలను ఆశ్రయించొచ్చునని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అలాంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని ధర్మాసనం తేల్చిచెప్పింది.
- బిల్లులకు ఆమోదం తెలిపే, తిరస్కరించే, రాష్ట్రపతికి పంపించే అధికారాన్ని గవర్నర్లకు రాజ్యాంగ అధికరణం 200 కల్పించింది. దాని అర్థం బిల్లులపై ఎప్పటికీ నిర్ణయం తీసుకోకుండా ఉండమని కాదు. రాష్ట్రాల్లో శాసన నిర్మాణ వ్యవస్థను స్తంభింపజేయమనీ కాదు.
- రాజ్యాంగంలోని అధికరణ 200 ప్రకారం మంత్రి మండలి సలహా, సూచనల మేరకు పని చేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉండబోవని కోర్టు స్పష్టం చేసింది. ఈ నిబంధనలకు సంబంధించిన మినహాయింపులను అధికరణ 200, అధికరణ 162(1) రెండో నిబంధనల్లో గుర్తించొచ్చునని తెలిపింది.



**రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే చట్టాలుగా మారిన పది బిల్లులు**

బిల్లులను చట్టాలుగా చేసే ప్రక్రియలో దేశంలోనే తొలిసారిగా అరుదైన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. తమిళనాడులో డిఎంకె ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్.ఎన్.రవికి మధ్య వివాదానికే గాక అంతిమంగా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుకు కారణమైన 10 బిల్లులు చట్టంగా మారాయి. ఆ క్రమంలో మరో సంచలనానికి కారణమయ్యాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా గవర్నర్ గానీ, రాష్ట్రపతి గానీ ఆమోదించకుండానే చట్టంగా మారిన బిల్లులుగా చరిత్ర సృష్టించాయి. తమిళనాడు అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపినా 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆమోదముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, అది చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు 2025 ఏప్రిల్ 8న తీర్పు వెలువరించింది. వాటికి గవర్నర్ ఆమోదం లభించినట్టుగానే పరిగణిస్తున్నట్టు పేర్కొంటూ ఆర్టికల్ 142 కింద తనకు సంక్రమించిన విశేషాధికారాల ద్వారా తీర్పు వెలువరించింది. దాంతో గవర్నర్ గానీ, రాష్ట్రపతి గానీ లాంఛనంగా ఆమోదించకుండానే సదరు 10 బిల్లులకు స్టాలిన్ ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తూ 2025 ఏప్రిల్ 12న గెజిట్ విడుదల చేసింది. రాజ్యాంగ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం 10 చట్టాలను నోటిఫై చేసింది.

**జమిలి ఎన్నికల బిల్లుల పరిశీలనకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ**

జమిలి ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశ పెట్టిన రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2024లను సమగ్రంగా, పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ-JPC) నివేదించబడ్డాయి. జమిలి ఎన్నికల నిర్వహణపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విస్తృత సంప్రదింపుల ద్వారా నివేదికను రూపొందించి పార్లమెంట్‌కు సమర్పిస్తుంది.

**పరిణామక్రమం..**


లోక్‌సభతోపాటుగా అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఏక కాలంలో ఎన్నికలు (జమిలి) జరిపేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను ఎన్డీయే నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2024 డిసెంబర్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన ఈ రెండు బిల్లుల్లో మొదటిది లోక్‌సభ, అసెంబ్లీల కాలపరిమితులను సవరించే 129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024 కాగా రెండోది పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికలకు సంబంధించిన కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు-2024. కాంగ్రెస్‌తోపాటుగా డిఎంకె, తృణమూల్, సమాజ్ వాదీ, ఎన్‌సిపి (ఎస్పీ), శివసేన (యూబిటి), మజ్లిస్ తదితర పార్టీలు బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించాయి. వాటిపై ఓటింగ్‌కు పట్టుబట్టాయి. దాంతో ఎలక్ట్రానిక్, పేపర్ స్లిప్ పద్ధతిన ఓటింగ్ జరిగింది. 269 మంది అనుకూలంగా ఓటేయగా, వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. నూతన పార్లమెంటు భవనంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థను ఉపయోగించడం ఇదే తొలిసారి. అయితే ఈ బిల్లులు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అధికారపక్షం మాత్రం ఈ బిల్లు రాజ్యాంగ మూల స్వరూపానికి ఏమాత్రం భిన్నంగా లేదని స్పష్టంచేస్తూనే.. అన్ని పక్షాలూ దీనిపై విస్తృత చర్చ కోరుతున్నందున జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపడానికి తమకేమీ అభ్యంతరం లేదని పేర్కొంది. ఈక్రమంలోనే జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపింది. జమిలి ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల(సవరణ) బిల్లు-2024లను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ-జేపీసీ) పరిశీలనకు సిఫార్సు చేయడానికి పార్లమెంట్ 2024 డిసెంబర్ 20న ఆమోద ముద్ర వేసింది.

- జమిలి ఎన్నికల నిర్వహణపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోదు. కేవలం విస్తృత సంప్రదింపుల ద్వారా నివేదికను మాత్రమే రూపొందిస్తుంది. ఇందుకోసం అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతుంది. కమిటీలో సభ్యులుకానీ ఎంపీలతో అలాగే రాజ్యాంగవరమైన మేథావులు, న్యాయ కోవిదులతో చర్చిస్తుంది. ఎన్నికల సంఘంలో మాజీ అధికారులతోనూ సంప్రదింపులు జరుపుతుంది. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ మాత్రం చేపడుతుంది. ఆపై తుది నివేదికను సమర్పిస్తుంది. ఆ తర్వాత అవసరమైన రాజ్యాంగ సవరణల కోసం పార్లమెంట్‌లో బిల్లులపై చర్చ జరుగుతుంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ తన నివేదికను 2025 బడ్జెట్ సమావేశాల చివరి వారం తొలిరోజు తన నివేదికను జేపీసీ పార్లమెంటుకు సమర్పించాలని గడువు విధించారు.

**సంయుక్త పార్లమెంటరీ కమిటీ స్వరూపం**

దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటుగా అన్ని రాష్ట్రాల శాసనసభలకూ ఏక కాలంలో ఎన్నికలు (జమిలి) జరిపేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2024లను సమగ్రంగా పరిశీలించడానికి, భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరపడానికి 39 మందితో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ)ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేశారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలకు ప్రాతినిధ్యం లభించింది.

- సంయుక్త పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా పి.పి.చౌదరి: 129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2024లపై తదుపరి అధ్యయనానికి ఏర్పాటు చేసిన 39 మందితో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీకి రాజస్థాన్ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహించనున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారని లోక్‌సభ సచివాలయం డిసెంబర్ 20న వెల్లడించింది. వృత్తి రీత్యా న్యాయవాది అయిన పిపి చౌదరి రాజస్థాన్‌లోని పాళి లోక్‌సభ స్థానం నుంచి వరుసగా మూడోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో కేంద్రమంత్రిగాను ఆయన పని చేశారు.



**జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 27 మంది లోక్‌సభ సభ్యులు:**

సంయుక్త పార్లమెంటరీ కమిటీలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సి.ఎం. రమేష్ (బిజెపి-అనకాపల్లి), వల్లభనేని బాలశౌరి (జనసేన, మచిలీపట్నం), జి.ఎం.హరీశ్ బాలయోగి (టిడిపి-అమలాపురం)లకు స్థానం కల్పించారు.

బిజెపి ఎంపిలైన పిపి చౌదరి (రాజస్థాన్), భాన్సురీ స్వరాజ్ (ఢిల్లీ), పురుషోత్తం రూపాలా (గుజరాత్), అనురాగ్ సింగ్ ఠాకూర్ (హిమాచల్‌ప్రదేశ్), విష్ణుదయాళ్ (జార్ఖండ్), భర్తృహరి మహతాబ్ (ఒడిశా), సంబిత్‌పాత్ర (ఒడిశా), అనిల్ బలూని (ఉత్తరాఖండ్), విష్ణుదత్ రాంశర్మ (మధ్యప్రదేశ్), బైజయంత్ పండా (ఒడిశా), సంజయ్ జైశ్వాల్ (బీహార్), చోటేలాల్ (ఎస్‌పి-యుపి) అనిల్ యశ్వంత్ దేశాయ్ (శివసేన-యుబిటి, మహారాష్ట్ర), శాంభవి (ఎల్‌జెపి-రామ్‌విలాస్-బీహార్), కె.రాధాకృష్ణన్ (సిపిఎం) కేరళ) జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి ప్రియాంకాగాంధీ (కేరళ), మనీష్ తివారీ (చండీగఢ్), సుఖ్‌దేవ్ భగత్ (జార్ఖండ్), ఎస్‌పి తరపున ధర్మేంద్ర యాదవ్ (ఉత్తర ప్రదేశ్), టిఎంసి నుంచి కల్యాణ్ బెనర్జీ (పశ్చిమబెంగాల్), డిఎంకె నుంచి సెల్వగణపతి (తమిళనాడు), ఎన్‌సిపి-ఎస్పీ నుంచి సుప్రియా సూలె, శివసేన నుంచి శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (మహారాష్ట్ర), ఆర్‌ఎల్‌డి నుంచి చందన్ చౌహాన్ (ఉత్తర్ ప్రదేశ్)లకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)లో సభ్యులుగా అవకాశం కల్పించారు.

జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యులుగా ఎంపికైనవారిలో పీపీ చౌదరి, పురుషోత్తం రూపాలా, అనురాగ్‌సింగ్ ఠాకూర్ గతంలో కేంద్ర మంత్రులుగా పనిచేశారు. సీఎం రమేష్ రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, ఇప్పుడు లోక్ సభ సభ్యుడిగా ఉన్నారు. బాలశౌరి మూడోసారి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. హరీశ్ తొలిసారి ఎన్నికయ్యారు. మహతాబ్ 7వసారి లోక్ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**జేపీసీలో చోటు దక్కించుకున్న 12 మంది రాజ్యసభ సభ్యులు**

జమిలి ఎన్నికల కోసం 39 మందితో ఏర్పాటుచేసిన జాయింట్ పార్లమెంటు కమిటీలో రాజ్యసభకు చెందిన 12 మంది 'పేర్లను' రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ డిసెంబర్ 20న వెల్లడించారు. ఇందులో తెలంగాణ నుంచి బిజెపి సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ నుంచి వైసిపి తరపున వి.విజయసాయిరెడ్డికి అవకాశం దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68